ఆర్ ఎస్ ఎస్ x భారతదేశం

# ఖాకీనిక్కర్లు
# కాషాయధ్వజాలు


రచన

**సవేరా**

**నళిని తనేజా**

**తీస్తా సెతల్వాద్**

అనువాదం

**సత్యరంజన్**



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

TITLE : RSS, the National Movement and its continuing Communal Agenda

ప్రథమ ముద్రణ : మే, 2016

వెల : ₹. 20/-

ప్రతులకు

PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-64, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ -520 002, ఫోన్ : 0866 - 2577533.

బ్రాంచీలు

విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు,

ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

psbhap@gmail.com

121257

# విషయసూచిక


★ ప్రవేశిక

**బృందాకరత్** **5**

★ ఆర్.ఎస్.ఎస్. లక్ష్యం హిందూరాజ్య స్థాపన

**సవేరా** **9**

★ జాతీయోద్యమం – ఆర్.ఎస్.ఎస్ పాత్ర

**నళిని తనేజా** **19**

★ ఆర్.ఎస్.ఎస్. కపట యోగ్యత

**తీస్తా సెతల్వాద్** **29**

★ సంఘ్ పరివార్ రక్తచరిత్ర

**తీస్తా సెతల్వాద్** **39**

★ హిందూత్వ పేరిట – ఉగ్రవాదం

**ఓ కూర్పు** **44**

★ 'ఆర్.ఎస్.ఎస్ అనేది ఒక కుటుంబం'

**గోపాల్‌గాడ్సే....తో ముఖాముఖి** **48**

★ ఆర్.ఎస్.ఎస్ పై నిషేధం

**పటేల్ ప్రకటన** **54**

# ప్రవేశిక

భారతదేశ వ్యతిరేకి ఆరెస్సెస్ అన్న శీర్షికన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆరు లఘు గ్రంథాలను ప్రచురించింది.

ప్రముఖ మేధావులు, రాజకీయ నాయకులు తదితరుల రచనలతో యీ లఘు గ్రంథాలు కూడి వున్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించిన నాటినుండి నేటి వరకు అది నిర్వహించిన, నిర్వహిస్తున్న తిరోగమన, విచ్ఛిన్నకర పాత్రను యీ లఘు గ్రంథాలు సాకల్యంగా వివరిస్తున్నాయి.

ఇవి: 1) ఖాకీనిక్కర్లు కాషాయధ్వజాలు 2) ఆర్.ఎస్.ఎస్. సైద్ధాంతిక కపటత్వం 3) గొడ్డు మాంస రాజకీయం మత విద్వేష వ్యూహం 4) ఆర్.ఎస్.ఎస్, బిజెపి ఆధ్వర్యంలో నయా ఉదారవాద విధానాలు 5) చరిత్ర, విజ్ఞాన శాస్త్రాలపై బిజెపి దాడి 6) రాజ్యాంగ దినం, అసహనాలపై పార్లమెంటులో చర్చ అన్న అంశాలపై 2015 నవంబరులో పార్లమెంటులో చర్చ సందర్భంగా రాజ్యసభ, లోకసభల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు మహమ్మద్ సలీంలు చేసిన ప్రసంగాలు.

ఈ లఘు పుస్తకాలలోని వ్యాసాలలో వుదహరించిన అనేక వుటంకింపులు ప్రధానంగా ఆరెస్సెస్ స్థాపకులు, ప్రత్యేకించి రెండవ సర్‌సంఘ్‌ఛాలక్ అయిన ఎం.ఎస్. గోల్వాల్కర్ రచనల నుండి యిచ్చినవేనన్న విషయాన్ని గుర్తుంచు కోవాలి. ఆరెస్సెస్ చేపట్టే సమకాలీన కార్యకలాపాలకూ ఆ రచనలకు సంబంధమేమిటని

ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఈ రచనలే యిప్పటికీ ఆరెస్సెస్ భావజాలానికి ఆకరంగానూ, దాని ప్రాపంచిక దృక్పథాన్నీ, కార్యాచరణనూ నిర్ధేశించేవిగానూ వున్నాయి. మనము లేదా మన జాతీయతా నిర్వచనము, పాంచజన్యం అన్న గ్రంథాలను గోల్వాల్కర్ రచించి ముప్పాతిక సంవత్సరాల కాలం గడచి వుండవచ్చు. అయినప్పటికీ హిందువుల కోసమే హిందూస్థాన్ అంటూ ప్రస్తుత ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌తో సహా ఆయనకు ముందున్న ఆరెస్సెస్ అధినేతలు చేసిన విషపూరిత వ్యాఖ్యలన్నీ వీటి ఆధారంగానే పుట్టుకు వచ్చాయి. గడచిన యీ అన్ని సంవత్సరాలలో ఆరెస్సెస్‌గానీ, లేదా, దాని రాజకీయ అవతారమైన బిజెపీగానీ ఆరెస్సెస్ స్థాపకులు రూపుదిద్దిన యే ఒక్క సూత్రాన్నయినా తిరస్కరించే సంగతి అలావుంచితే కనీసం వాటినుంచి విడగొట్టుకున్నట్లు చూపించే ఒక్క ప్రకటనగానీ, ప్రచురణగానీ లేనేలేదు. తద్విరుద్ధంగా ప్రస్తుత ప్రధాన మంత్రి తన పుస్తకంలో గోల్వాల్కర్ జీవితాన్ని గురించి రాస్తూ ఆయనను 'కాంతి పుంజం' అనీ, తనకు స్ఫూర్తినిచ్చిన వారిలో ఒకరనీ పేర్కొన్నారు. కనుక యీ లఘు గ్రంథాలలో వుదహరించిన వుటంకింపులు ఆరెస్సెస్ భావజాలాన్ని వివరిస్తాయి. కొన్ని పునరుల్లేఖనాలు వుంటాయి, ఇవన్నీకూడా విదేశీ ఫాసిస్టులైన హిట్లర్ నాజీల నుంచీ, ముసోలినీ బ్లాక్‌షర్ట్‌ల నుంచీ స్ఫూర్తి పొందినవే, ఆరెస్సెస్ 'మౌలికతను'అవగాహన చేసుకోవటానికివి వుపయోగ పడతాయి.

ఆరెస్సెస్ గతాన్ని తవ్వితీయవలసిన అవసరమున్నదా, అనుద్ధేశంగానైనా వాటి ప్రాధాన్యాన్ని యివి హెచ్చించటం లేదా అన్న ప్రశ్నలు తలయెత్తవచ్చు. ఈ లఘు గ్రంథాలలోని పలు వ్యాసాలు తెలియ చెప్తున్నట్లుగా 'అన్యులకు' వ్యతిరేకంగా హింసను ప్రేరేపించేటందుకై ఆరెస్సెస్ అతి హేయమైన పద్ధతులను అనుసరిస్తున్నది. ఇందుకుగాను మత భావనలను వుపయోగించు కోవాలని, అదేవిధంగా యీనాటికీ మన ప్రజలలోని అట్టడుగు తరగతుల వారిని ప్రభావితం చేస్తున్న సామాజిక అసమానతల, లింగ తారతమ్యాల ప్రాతిపదికను కలిగివున్న సంప్రదాయాలను, విశ్వాసాలను వినియోగించు కోవాలని ప్రయత్నిస్తున్నది. ఆరెస్సెస్ బోధించే హిందూత్వ అనేది వి.డి. సావర్కార్ రూపుదిద్దిన రాజకీయ భావన మాత్రమే. సాధారణ హిందూ విశ్వాసులకిది చాలాదూరం. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని

వినియోగించు కోవటాన్ని వ్యతిరేకించి పోరాడేవారు తమ పోరాటం యొక్క లోతుపాతులు తెలుసు కోవలసిన అవసరం ఎంతైనా వున్నది.

వేర్వేరు మత విశ్వాసాలకు చెందిన విభిన్న ఛాందసవాద శక్తులు మతాన్ని రాజకీయాల కోసం వుపయోగ పెట్టుకుంటున్నాయి. ముస్లిం మత ఛాందసవాదులు అంతకంతకూ ముస్లిం యువజనుల్లోకి చొచ్చుకు పోవటం తీవ్రమైన ఆందోళన కల్గిస్తున్నది. ఈ శక్తులను ఏకాకులను చేసి వెనక్కు కొట్టవలసి వుంది.

జాతికి ప్రాతినిధ్యం వహిస్తున్నామంటూ తప్పుడు రీతిలో చెప్పుకునే మెజారిటీ హిందూ ఛాందసవాదులు నుంచి ముస్లిం ఛాందసవాదులు ప్రోత్సాహాన్ని పొందుతున్నారు. పరస్పర విరుద్ధ శక్తులుగా కనిపించే వీరు ఒకర్నొకరు బలపరచుకుంటూ మౌలిక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరలిస్తున్నారు.

నరేంద్రమోడీ నేతృత్వాన బిజెపీ ప్రభుత్వం కేంద్రంలో తిష్టవేయడంతో, గతంలో అటల్ బిహారీ వాజపేయి హయాంలోవలె అధికార యంత్రాంగానికి ఆరెస్సెస్ దగ్గర కావటమేకాక, వాస్తవంలో ప్రభుత్వాన్ని అదుపుచేసే స్థాయికి చేరింది. మంత్రుల పనితీరు గురించి ఆరెస్సెస్ నాయకులకు నివేదికలను సమర్పించినపుడే అసలైన నాయకులెవరో స్పష్టమైంది. కనుక ఆరెస్సెస్ నిజస్వరూపాన్నీ, ప్రభుత్వంతో దానికున్న సంబంధాలనూ, యీనాడు రాజ్యాంగేతర శక్తిగా అది అధికారాన్ని చెలాయించటం గురించి బహిర్గతం చేయవలసి వుంది.

అంతేకాక నిజానికి నరేంద్ర మోడీ ఒక ప్రచారక్, అంటే, ఆరెస్సెస్ భావజాలానికీ, దాని సిద్ధాంతాలకూ, కార్యచరణకూ కట్టుబడిన పూర్తికాలపు కార్యకర్త. ఒక ప్రచారక్, భారత ప్రధాన మంత్రిగా మారటం ఆరెస్సెస్ పథకంలో పెద్ద ముందడుగు. గుజరాత్–2002, ఆయన నేతృత్వంలో సాగిన హిందూరాష్ట్ర పథకం యొక్క ఫలితం, ఒక ప్రయోగం. దీనికి ఆరెస్సెస్ పూర్తి మద్దతు వున్నది. 2014 లోకసభ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించి పెట్టేదెవరన్న విషయమై 2013–2014లో బిజెపీలో విభేదాలు తలెత్తినపుడు మోడీ అభ్యర్థిత్వానికి ఆరెస్సెస్ వెన్నుదన్నుగా నిలవటమే కాక ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ఎల్.కె. అద్వానీ తదితర సీనియర్ నాయకుల వ్యతిరేకతను రెచ్చకొట్టింది. ఒకప్పుడు ఆరెస్సెస్‌లో తనకు సహచరులూ, యీనాడు బిజెపీ ప్రభుత్వంలో వున్నవారు పదేపదే

మతవుద్రికత్తలను రెచ్చగొట్టే చర్యలకూ, ప్రకటనలకూ పాల్పడుతున్నప్పటికీ వారిపై చర్య తీసుకోవటానికి ప్రధాన మంత్రి నిరాకరణ ఆరెస్సెస్‌పట్ల ఆయనకున్న విధేయతను తెలియచెప్తున్నది. భారతదేశపు ప్రధానమంత్రి ముందుగా ఆరెస్సెస్ కార్యకర్త.

కనుక ఆరెస్సెస్ దేనికి ప్రాతినిధ్యం వహిస్తున్నదో దానికి సంబంధించిన వాస్తవాలు, కార్యకలాపాలు, విశ్లేషణా అందచేయ వలసిన అవసరం వున్నది. లౌకికవాద, ప్రజాస్వామ్య, సమానత్వ సూత్రాలను పరిరక్షించి పటిష్టం చేసేందుకై జరిగే పోరాటంలో యీ లఘు పుస్తకాలు వుపయోగ పడగలవనే మేము ఆశిస్తున్నాము.

ఈ వ్యాసాలను రచించి యిచ్చిన వారికీ, వీటిని వెలికి తీసుకువచ్చేందుకు తోడ్పడిన కామ్రేడ్స్‌కు, పార్టీ మిత్రులకు కేంద్ర ప్రచురణల తరపున మేము కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. వీటి నిమిత్తం వుపయోగించు కోవడానికి అనుమతి యిచ్చిన కార్టూనిస్టులకు కూడా మేము ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము.

**బృందాకరత్**

పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

# ఆర్.యస్.యస్.లక్ష్యం హిందూ రాజ్యస్థాపన

'సవేరా'

2014 లోక్‌సభ ఎన్నికలలో మోడీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ముందుపెట్టి పోటీలో నిలబడిన బీజేపీకి ఓటువేసిన ప్రజానీకానికి తాము ఆర్.యస్.యస్‌కి అధికారం కట్టబెట్టబోతున్నాం అన్న విషయం తెలియనే తెలియదు. మోడీ స్వయానా ఆర్.యస్.యస్.లో మూడు దశాబ్దాల పాటు చురుకైన కార్యకర్త (ప్రచారక్)గా పనిచేశాడు. అధికారం చేపట్టిన అనేకమంది మంత్రులు, ఎక్కువలో ఎక్కువమంది పార్లమెంటు సభ్యులు ఆర్.యస్.యస్. కుదురు నుండి వచ్చినవారే. ప్రధానమంత్రి మోడి నుండి కిందివరకూ వీరంతా ఆర్.యస్.యస్. భావజాలానికి పట్టుకొమ్మలే. అందుకే ఇవాళ ఆర్.యస్.యస్.కు అనుబంధంగా పనిచేసే పుట్టగొడుగుల్లాంటి సంస్థలనేకానికి ఎక్కడ లేని కొమ్ములు వచ్చేశాయి. తొంభై ఏళ్లుగా అవి కొనసాగిస్తున్న హింసాత్మక విద్వేష ప్రచారం ఇప్పుడు మరింత ఊపందుకుంది. ప్రజల మధ్య అనైక్యత సృష్టిస్తూ దేశ సామాజిక యవనికను ఛిద్రం చేసి మధ్య యుగాల నాటి చీకటి రోజులను గుర్తుచేసే పరిస్థితులు సృష్టిస్తున్నాయి.

ఇంతకీ ఆర్.యస్.యస్., దాని అంతేవాసులు కోరుకుంటున్నది ఏమిటి? ఈ దేశాన్ని ఏ రూపాన నిర్మించాలనుకుంటున్నారు? అవి ఎట్లా ప్రమాదకరమైనవి తదితర అంశాలను ఇప్పుడు పరిశీలిద్దాం.

**‘హిందూ’ రాజ్యం**

ఆర్.యస్.యస్. అంతిమ లక్ష్యం ఈ దేశాన్ని ‘హిందూ’ రాజ్యంగా మార్చడం. ఆర్.యస్.యస్. ప్రవచిత ‘హిందూ’ రాజ్య రూపురేఖ విలీనాలు ఎలా ఉండాలో ఆ సంస్థకు సుదీర్ఘ కాలం పాటు అధిపతిగా పనిచేసిన యం.యస్. గోల్వాల్కర్ ‘వుయ్ – ఆర్ అవర్ నేషన్ హుడ్ డిఫైన్డ్’ (మనం లేక మన జాతీయత నిర్వచనం) అన్న పుస్తకంలో సవివరంగా పేర్కొన్నారు. ఆ గోల్వాల్కర్‌నే గొప్ప దార్శనికుడిగా, ఆత్మయోగిగా కీర్తిస్తూ మోడి చిన్న పుస్తకం కూడా రాశాడు.

‘హిందూ’ జాతి కొన్ని లక్షల ఏళ్ళగా ఈ గడ్డమీద నివసిస్తూ వచ్చింది అనేది గోల్వాల్కర్ మొదటిమాట. నిజానికి ఈ మాట శాస్త్రీయ ఆధారాలకు నిలబడేది కాదు. అందుకు ఎలాంటి చారిత్రక ఆధారాలూ లేవు. “ఈ దేశం గొప్ప గొప్ప ఆత్మజ్ఞానులు, దైవాంశ సంభూతులు, నడియాడిన నేల. కాని హిందువుల అలక్ష్యం, వారి మెతకదనం మూలంగా ఈ గడ్డమీదకి హంతక దోపిడీ దుండగులు దండెత్తి వచ్చి కలుషితం చేసేవారు. వెయ్యేళ్ళుగా సాగుతూ వచ్చిన ఈ దుర్మార్గం మూలంగా హిందూ జనాభా క్రమేపీ తగ్గిపోతూ వచ్చింది” అని చెబుతున్న గోల్వాల్కర్ ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ మా నేల సంకరమై పోవడానికి కారణం ముస్లిమ్‌లని చెప్పకనే చెబుతున్నాడు. కాబట్టి ఇప్పుడు వారి ప్రభావం ఉజ్జీవింప చేయడం, హిందూరాజ్యాన్ని స్థాపించడం ప్రతి ఆర్.యస్.యస్ శాఖా సభ్యుడి పరమోన్నత కర్తవ్యం అని ఉద్బోధించాలి.

‘హిందూ రాష్ట్రంలో నివసించేది పక్కా హిందువులు మాత్రమే అనేది గోల్వాల్కర్ మొదటి ప్రవచనం.

“ఈ దేశం ‘హిందూస్థాన్’ హిందూజాతి, హిందూమతం, హిందూ సంస్కృతి దాని నుండి పుట్టుకొచ్చిన భాషలు – ఇవీ మన జాతి భావనను పరిపుష్టం చేస్తాయి. హిందూస్థాన్‌లో ఉన్నది, ఉండదగినది ప్రాచీన హిందూజాతి మాత్రమే...అది తప్ప వేరేది అంటే హిందూజాతి, హిందూమతం, హిందూభాషా సంస్కృతులకు భిన్నమైన వారెవరైనా జాతి జీవనం నుండి అసుంటా ఉండాల్సిందే” గోల్వాల్కర్ మాటల్లో బ్రాహ్మణాధిపత్య భావజాలం దాచాలనుకున్నా దాగని రీతిలో వెల్లడవుతు

ఉంది. ఇతర మతాలు, ఇతర విశ్వాసాల పట్ల ఉన్న విద్వేషం కొట్టొచ్చినట్టు కనబడుతూ ఉంది. హిందూరాష్ట్రంలో సంస్కృత భాష మాతృకగా కలిగిన భాష మాట్లాడేవారికే స్థానం ఉన్నదని చెప్పడమంటే ద్రవిడ, గిరిజన భాషలు మాట్లాడేవారు ద్వితీయ పౌరులుగా ఉండాల్సిందేనా? హిందీని జాతీయ భాషగా దేశం మొత్తం మీద అమలు చెయ్యాలని ఆర్.యస్.యస్ తొలి రాజకీయ రూపమైన జనసంఘ్ నుండి నేటి బిజేపి వరకు డిమాండు చెయ్యడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఇది.

హిందువులు కానివారు జాతి జీవనం నుండి వెలిగా బతకాల్సిందే అని గోల్వాల్కర్ తన మాటల్లోనే ఎంత మోటుగా చెప్పాడో చూడండి.

> "జాతికి సంబంధించినంతవరకు మన మదిలో ఉండాల్సిన ముఖ్యాంశం ఏంటంటే ఇందాక చెప్పుకున్న ఐదు అంశాలు – జాతి, మతం, సంస్కృతి, భాష, రాజ్యం – పరిధిలో లేనివారికి జాతీయ ప్రధాన స్రవంతి జీవనంలో భాగం ఉండదు. హిందూ జాతిని, మతాన్ని, సంస్కృతిని, భాషని అంగీకరించి, తమ ఉనికిని హిందూ జాతిలో కలిపివేసుకునేందుకు సిద్ధపడిన వారికే జాతి జీవనంలో భాగస్వామ్యం ఉంటుంది. లేదూ తమజాతి, మత, భాష భేదాలను అలాగే అట్టిపెట్టుకోవాలనుకునేవారు ఈ గడ్డమీద పరాయి దేశస్థుల్లా బతకాల్సిందే – అదీ ఈ జాతి దయమీద ఆధారపడి. లేదూ జాతి వ్యతిరేకులుగా, శాపగ్రస్తులుగా మిగలాల్సిందే (పేజి101)"

అంటే ముస్లిమ్‌లు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, ఇతరేతర గిరిజన తెగల వంటి హైందవేతరులందరూ ఈ దేశంలో బతకాలంటే 'హిందూత్వ' సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలి లేదంటే ద్వితీయశ్రేణి పౌరులుగా బతకాలి. గోల్వాల్కర్ 'హిందూరాజ్యం' అంటే ఏమిటో ఎలాంటి చచ్చులేకుండా చాలా సూటిగానే చెప్పాడు. హిందూత్వము అంగీకరించని వారంతా ఈ గడ్డమీద పరాయిదేశస్థుల్లా, కాందిశీకుల్లా బతకాల్సిందే అని తేల్చి చెప్పేసాడు – అంతేకాదు.

> "......హిందుస్థాన్‌లో బతకదలచిన అన్యజాతుల వారు హిందూ సంస్కృతి ఔన్నత్యం పట్ల వినయ విధేయతలు ప్రదర్శించాలి. హిందూ జాతిలో, సంస్కృతిలో మమేకం కావాలి. అప్పుడే వారికి ఇక్కడ చోటు ఉంటుంది.

లేదంటే వారు హిందూజాతికి సేవకులుగా బతకాలి. ఎలాంటి హక్కులు, ప్రత్యేక సదుపాయాలు ఆఖరికి పౌరసత్వ హక్కులుకూడా లేకుండా జీవించాలి.” అంటాడు.

గోవ్వాల్కర్ ఈ పుస్తకం 1930వ దశకం చివరిలో, అడాల్ఫ్ హిట్లర్ నాజీ పార్టీ జర్మనీలో రాజ్యాధికారం కైవసం చేసుకుని ఉచ్ఛదశలో ఉన్న కాలంలో రాసినది. యూదు జాతీయులపై నాజీ ముష్కర మూకలు సాగించిన అమానవీయ హింసాకాండను గోల్వాల్కర్ నిర్లజ్జగా బలపరిచారు.

“యూదు జాతీయులను అణగదొక్కడం ద్వారా జర్మనీ యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. జాతి ఔన్నత్యాన్ని ఇంతకన్నా గొప్పగా ప్రదర్శించిన ఉదంతం వేరొకటి లేదు. జాతి, సంస్కృతుల భేదాలను మూలాల కంటూ పరిష్కరించి ఒక్కజాతిగా జర్మనీని నిలబెట్టడం ఎలానో చాటి చెప్పింది. హిందూస్థాన్ కూడా దీని నుండి పాఠం నేర్చి లబ్ధిపొందాలి”(పే. 88) ఇక్కడైతే ఆర్.యస్.యస్ కు హైందవేతర మతస్థుల పట్ల ముఖ్యంగా ముస్లిమ్‌ల పట్ల ఉన్న ధృక్పథం ఏమిటో ఇట్టే బోధపడుతుంది. అయితే వాళ్ళు సొంతగూటికి (ఘర్‌వాపసీ) మరలి రావాలి లేదంటే అంతరించి పోవడానికి సిద్ధంగా ఉండాలి. అందుకే బిజెపి నాయకులు తమ అభిప్రాయాలను వ్యతిరేకించేవారిని ఉద్దేశించి ‘ఈ దేశం విడిచిపోండి’ ‘పాకిస్థాన్ పోండి’ అని తరచూ అంటారు. మైనార్టీ మతస్థులకు వ్యతిరేకంగా హింసా, దౌర్జన్యాలను అందుకే రెచ్చగొడుతుంటారు, మత కలహాలు సృష్టిస్తుంటారు. అధికారంలో ఉంటే గుజరాత్‌లోని గోద్రా వంటి నరమేధాలకు తెగబడుతుంటారు.

‘జాతీయత, ‘దేశభక్తి’ ఈ రెండు అంశాలనూ ఆర్.యస్.యస్ వాదులు అతి సంకుచితంగా హిందూజాతి ఔన్నత్యం ప్రాతిపదికగా నిర్వచిస్తుంటారు. ఇందుకు లోబడని కార్యకలాపాలన్నీ వారి దృష్టిలో జాతి వ్యతిరేకమైనవే, అలాంటి వారందరూ దేశద్రోహుల జాబితాలో చేరిపోవాల్సిందే. గురుగోల్వాల్కర్ తనగా చెప్పిన మాటలు ఇవి :

“హిందూజాతిని ఇప్పుడున్న నిద్రాణావస్థ నుండి ‘జాగృత’ం చేసి జవజీవాలు సంతరించుకుని పునరుత్తేజం పొందేందుకు తోడ్పడే కార్యకలాపాలే నిక్కమైన

జాతీయ కార్యకలాపాలు, హిందూజాతిని, హిందూమతాన్ని ఉన్నతీకరించే ఆకాంక్షలను గుండె నిండా కలిగి ఉన్నవారే అసలైన దేశభక్తులు. మిగిలిన వారందరూ జాతి ప్రయోజనాలకు భంగం కలిగించే ద్రోహులూ, శత్రువులే. లేదూ ఇంకాస్త ఉదారంగా చెప్పుకోవాలంటే మూర్ఖులే."

**మతరాజ్యం**

గోల్వాల్కర్ ఆలోచనలన్నీ ఏం తెలియచేస్తున్నాయి. సనాతన ధర్మాన్ని అనుసరించే ఒక మత రాజ్య స్థాపనే ఆర్.యస్.యస్ లక్ష్యం అని తెలియచెప్పడం లేదూ! ఈ మత రాజ్యం ఎలా ఉంటుంది?

మతోన్మాదం తలకెక్కిన దేశాలు ఎలాంటి అధోగతిలో ఉంటాయో వర్తమాన ప్రపంచంలో మనకు అనేక ఉదాహరణలు కళ్ళెదుట కనిపిస్తున్నాయి. 1992 నుండి 2001 వరకు అఫ్ఘనిస్థాన్‌లో సాగిన తాలిబన్ పరిపాలన, తాజాగా "సిరియా, ఇరాక్ దేశాలలో 'ఐఎస్ఐ' అగడాలు ఇందుకు తార్కాణాలు. ఆయా దేశాల ప్రభుత్వ విధి విధానాలు, పరిపాలన ఇస్లామిక్ చట్టానికి లోబడి సాగాలనేది మతోన్మాదం తలకెక్కిన ఛాందస్సుల లక్ష్యం. ఆధునిక రాజరిక పరిపాలనలో ఉన్న సౌదీఆరేబియా కూడా ఇందుకు మినహాయింపు కాదు. (నిన్నా మొన్నటి దాకా ఆ దేశంలో మహిళలకు ఓటు హక్కు కూడా లేదు). ఇరాక్ లో కూడా ఇస్లామిక్ చట్టానికి లోబడే పరిపాలనా సాగుతుంది. కాని గత కొంత కాలంగా ఆధునిక భావాలకు చలిస్తున్నారు. ఇహ పాకిస్థాన్ విషయానికి వస్తే జనరల్ జియా ఉల్‌హక్ దేశాధ్యక్షుడిగా ఉన్నంతకాలం (1978–88) ఇస్లామ్ చట్టమే అధికారికంగా రాజ్యం చలాయించింది. మరో మత రాజ్యానికి ఉదాహరణ ఇజ్రాయిల్. 'హిబ్రూ' నియమానుసారం పరిపాలనా సాగుతుంది. అక్కడ ఈ మతరాజ్యాలన్నింటా మైనారిటి మతస్థులు లేరు. ఒకే మతంలోని భిన్నమైన తెగవారిమీద క్రూరమైన హింసాకాండ కొనసాగుతోంది. ఇహ రాజ్యాన్ని సొంత మతం వారు ప్రశ్నించినా సరే వారికి తీవ్ర దండన తప్పని పరిస్థితి.

ఈ మతరాజ్యాలన్నింటా ప్రజల మధ్య అనైక్యత నెలకొని ఉండటం, రోజువారి హింసాత్మకదాడులు జరగడం రోజూ మనం చూస్తూనే ఉన్నాం. ముస్లింలే మెజారిటిగా ఉన్నప్పటికీ తూర్పు పాకిస్థాన్ ప్రజానీకం మీద పశ్చిమ పాకిస్థాన్

దమనకాండ 1971వరకు, తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా అవతరించేవరకు కొనసాగింది. ఈ ప్రపంచంలో నేపాల్ ఒక్కటే హిందూరాజ్యాంగా ప్రకటించుకున్న దేశం. రాజరికపాలనలో ప్రజలు ప్రత్యక్ష నరకం చవిచూసారు. పదేళ్ళ సాయుధపోరాటం ద్వారా రాజరికాన్ని కూల్చి వేసి గణతంత్ర రాజ్యం ఏర్పరుచుకున్నారు. హిందూరాజ్యంగా ఉన్న ఆ దేశాన్ని లౌకికరాజ్యంగా ప్రకటించుకున్నారు. భిన్న మతాలు విభిన్న సంస్కృతులకు అలవాలమైన ఏ దేశమూ ఆధునికంగా అభివృద్ధి చెందడానికి ప్రజాస్వామ్యం మినహా మతాన్ని ఎక్కడా అలంబనగా చేసుకోలేదు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా మనకు ఎదురయ్యే అనుభవం ఇదే.

బహుశ, బిజెపి ఈ దేశాన్ని హిందూరాజ్యంగా ఎక్కడ చేస్తుందో అని మనం అతిగా ఆలోచిస్తున్నాం ఏమో అని కూడా అనుకోకండి. అసలు బిజెపి లక్ష్యమే ఈ దేశాన్ని హిందూ రాజ్యంగా మలచడం. గురుగోల్వాల్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలే ఆర్.యస్.యస్ ని గాని, బిజెపిని గాని నడిపిస్తున్నాయి. అందుకే మనదేశానికి స్వాతంత్ర్యం రాగానే ఆర్.యస్.యస్ అధికారిక పత్రిక రాజ్యాంగాన్ని రూపొందించమని డిమాండు చెయ్యడం వదిలేసి మనుస్మృతిని ఈ దేశాన్ని నడిపే చట్టంగా చెయ్యమని కోరింది. (1949 నవంబరు 30, 1950 జనవరి 25 సంచికలు చూడండి). మనుస్మృతి మహిళలు, దళితుల పట్ల ఎంత వివక్షత ప్రదర్శిస్తుందో ఎవరికీ తెలయనిది కాదు. అందుకే బాబాసాహేబ్ అంబేద్కర్ మనుస్మృతి ప్రతిని తగులబెట్టారు.

'ప్రజాస్వామ్యం అనేది పశ్చిమదేశాల భావజాలం అది భారతదేశానికి పొసగదు' అని ప్రకటించేసారు గోల్వాల్కర్. హిందూరాజ్యాన్ని నిస్వార్థమైన, అంకితమైన అతి కొద్దిమంది సమూహం పరిపాలించాలి అంటాడు (శ్రీ గురుజీ సమగ్ర వాల్యూం 5 పుటలు 89-90). ఆచరణలో ఇది ఫాసిజం వినా మరొకటి కాదు. అంతేకాదు మనుస్మృతిని అనుసరించి వర్ణాశ్రమ ధర్మాన్ని రుద్దడం ద్వారా బ్రాహ్మణులు పరిపాలకులుగాను మిగిలిన శూద్ర వర్ణాలన్నీ పాలితులుగానూ ఉండాలనే పాతరాతి యుగం నాటి రాజరికాన్ని పున: ప్రతిష్ఠించడం కాదా?

ఆర్.యస్.యస్ నిర్మాణరూపంలోనే ఈ ఫాసిస్టు లక్షణాలు ఉన్నాయి.

సంస్థాగతంగా ఏనాడు ఎన్నికలు జరుపుకోని ఏకైక సంస్థ ఆర్.యస్.యస్. సంస్థకు సుప్రీమ్ బాస్‌గా వ్యవహరించే 'సర్‌సంఘ్‌చాలక్'ను కూడా పదవి నుండి దిగిపోయే వ్యక్తి నామినేట్ చేసేస్తుంటాడు. ఇప్పటిదాకా సర్ సంఘ్‌చాలక్‌లుగా పనిచేసినవారంతా బ్రాహ్మలే. ఆ క్రిందన రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, ప్రాంతీయ స్థాయి నుండి శాఖా ప్రచారక్ వరకూ 'నామినేషన్' పద్ధతినే ఎంపిక చెయ్యబడుతూ ఉంటారు. మిలిటరీ జవానులు, ప్రదర్శనలు, 'మార్చ్-ఫాస్ట్'లు, స్పెషల్' వందనాలు, చడ్డీ-చొక్కా యూనిఫారమ్, 'దేశభక్తి' గీతాలాపన.....ఇవన్నీ నాజీల నుండి ఆర్.యస్.యస్ అరువు తెచ్చుకున్నవే.

ఇంతకీ ప్రజల సంగతి ఏమిటీ? ఆర్.యస్.యస్ లక్ష్యంగా పెట్టుకున్న 'హిందూరాజ్యం'లో ప్రజల స్థానం ఏమిటీ? ప్రజలు ఏరకంగా జీవిస్తారు? జీవితాల లక్ష్యాలు ఏమిటి ప్రజల పాత్ర ఏమిటీ అని తెలుసుకోవాలిగా. ఈ ప్రశ్నలకు కూడా గోల్వాల్కర్ వివరణలు ఇచ్చారు. భౌతికమైన ఆనందాలకోసం వెంపర్లాడకుండా మోక్షమార్గాన్ని అందించే మత విధానాలకు అనుగుణమైన జీవితాన్ని గడపాలని ప్రజలకు మార్గనిర్దేశం చేసాడు. భౌతికమైన ఆనందాలు తుచ్ఛమైనవని స్పష్టం చేసాడు. కాని దుర్భర దారిద్ర్యం, సామాజిక వివక్ష, దోపిడిలకు లోనవుతున్న మెజార్టీ ప్రజానీకం జీవితాలు ఎలా మెరుగుపరచాలి అనేది మాటవరసకైనా మీకు ఎక్కడా కన్పించదు 'గురుబోధన'ల్లో.

హిందూరాజ్యం అనుసరించాల్సిన ఆర్థిక విధానాల గురించి కూడా గోల్వాల్కర్ అనేక ప్రతిపాదనలు చేసాడు. అయితే అవన్నీ పిల్ల తరహాగా, పరిణితి లేని ఆలోచనలుగా అనిపిస్తాయి ఎవరికైనా. గ్రామాలు స్వయం పోషకాలుగా ఎదగాలి, దేశం భారీ పారిశ్రామికీకరణ చెందాలి అని (వాల్యూం5-పేజి 13,14, వాల్యూం 9పేజి 59పేజిలలో) చెప్తాడు. ఉత్పత్తిని పెంచడానికి ఆవుపేడని వినియోగించుకోవాలని నొక్కి చెబుతాడు(వాల్యూం 5పేజి 65-68). ఇహ పేదల గురించి దు:ఖం పెట్టుకుని, దారిద్ర్య నిర్మూలనకోసం ప్రతి హిందువూ పేదలు, అన్నార్తుల కోసం పిడికెడు గింజలు తీసి పక్కన పెట్టాలి అన్న పరిష్కారమార్గాన్ని సూచించారు. (వాల్యూం5. పేజి92) పేదరిక నిర్మూలనకు పిడికెడు ధాన్యం దానం పరిష్కారమా? ఇంకా ఇలా చెప్పాడు గురుగోల్వాల్కర్; ప్రజలు స్వార్థం చూసుకోవడం

మానేసి అత్యంత నిజాయితీతో అత్యంత శ్రమకోర్చి జాతీయ సంపదను పెంచాలట! ఇదిగో ఇలాంటి పునాది లేని ఆలోచనల మీద హిందూరాష్ట్ర పునాదిని నిర్మించాలని, ప్రపంచానికి ఒక ఆశాదీపంగా భారతదేశాన్ని మలచాలని ఆర్.యస్.యస్ భావిస్తుంది. అంటే పేదలు, కష్టజీవులు తమ జీవన ప్రమాణాల మెరుగుదలకోసం ఆశించకుండా దేశంకోసం, దేశ ప్రతిష్టకోసం మరింత ఒళ్ళొంచి పనిచెయ్యాలనేది గురూజీ ప్రవచనం. జనం అంతా కష్టం చేస్తే సంపద పెరిగి (ఎవరికి?) దానంతట అదే పేదరికాన్ని పరిష్కరిస్తుందట.

పేదలు చెయ్యాల్సిన కష్టం గురించి మరింతగా చెమటోడ్చడం గురించి చెప్పారు సరే మరి ఉత్పత్తి సాధనాలయిన భూమి, యంత్రాలు పెట్టుబడుల మీద ఆధిపత్యం చలాయిస్తున్నవారేం చెయ్యాలి? అది కూడా సూచించారు గురూజీ 'సంపన్నులు తమ మనసు మార్చుకుని సంపద ఇంకా ఇంకా పోగేసుకునే ఆలోచన మాని పదిమందికి పంచడం అలవాటు చేసుకోవాలి'ట (వాల్యూం 2-పేజి 100-101). ఇది గాంధీజీ చెప్పే ధర్మకతృత్వం లాంటిదే. పెట్టుబడిదారుల దోపిడిని యధాతధంగా కాపాడుకుంటూ వచ్చేవాళ్ళు చెప్పేమాటలే ఇవి. ఈ మనసు మార్చుకునే సిద్ధాంతం అసలు సిసలైన భారతీయ పరిష్కారం అని కూడా గోల్వాల్కర్ ప్రకటించేసాడు. కాని ప్రపంచవ్యాప్తంగా దోపిడి శక్తుల కొమ్ముకాసే వారందరి కొండగుర్తు వాదనలే ఇవి అని అందరికీ తెలుసు.

కోట్లాది మంది కష్టజీవుల రెక్కల కష్టాన్ని దోచుకుని తమ బొక్కసాలు నింపుకుంటున్న భూస్వాములు, పారిశ్రామికాధిపతుల దోపిడిని మసిబూసి మారేడుకాయ చేసే ఈ ఆర్థికవిధానాలు, హిందూజాతి ఔన్నత్యం గురించి పుంఖాను పుంఖాలుగా చేస్తున్న ప్రకటనలు - ఇవే ఆర్.యస్.యస్ స్థాపించాలనుకుంటున్న 'హిందూరాజ్యం' యొక్క ఆవిభక్త లక్షణాలు. జనంలో మతమౌఢ్యాన్ని పెంచి పోషించి తాము ఏ పీడనకు, దోపిడికి గురవుతున్నామో గుర్తించకుండా చెయ్యడమే ఆర్.యస్.యస్ సైద్ధాంతిక లక్ష్యం. మరోపక్కన ఫాసిస్టు తరహా పరిపాలన ద్వారా కష్టజీవులను, అణగారిన వర్గాలను మరింతగా అణిచిపెట్టి ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న పెట్టుబడిదారులు, అగ్రవర్ణాలు యధేచ్ఛగా తమ దోపిడి

కొనసాగించుకోవడానికి తగినంత వెసులుబాటు కల్పిస్తుంది ఆర్.యస్.యస్ ఆశించే 'హిందూరాజ్యం'.

## ఆర్.యస్.యస్ తన లక్ష్యాన్ని నెరవేర్చుకోగలుగుతుందా

ఆర్.యస్.యస్ ప్రవచిస్తున్న శాస్త్రీయమైన మన్యముగల నాటి భావజాలం, మతోన్మాధ ధోరణుల గురించి ప్రజానీకానికి అవగాహన కల్గించితే ప్రజలు ఆర్.యస్.యస్, దాని రాజకీయ రూపమైన బిజెపిని ఛీ కొట్టడం ఖాయం. నాగపూర్‌లో ఒక పిడికెడు మంది అగ్రహారీకులు దశాబ్దాలక్రితం రూపొందించిన మొదలు రాజ్య నమూనాను దాటుకుని ఈ ప్రపంచం, మన భారతదేశం చాలా ముందుకు వెళ్ళాయి. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాద పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడి, దాన్ని ఈ దేశం నుండి తరిమికొట్టిన ఘన పోరాట వారసత్వం కలవారు ఈ దేశ ప్రజానీకం. ఆ పోరాటంలో కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా అపూర్వమైన ఐక్యత ప్రదర్శించారు. అయితే, ఆ రోజున ప్రజలు కలలు కన్న సమసమాజం, సమన్వయం సాకారం కాని మాటనిజమే. అందుకు స్వాతంత్ర్యానంతరం అధికారం చేపట్టిన వారు అనుసరించిన తప్పుడు విదానాలే కారణం. దానికి తోడు ఈ విధానాల పట్ల వ్యతిరేకత ఏకీకృతం కాకుండా చూడడానికి పాలకశక్తులు ప్రజల మధ్య అనైక్యతను కూడా సృష్టిస్తూ వచ్చాయి. ఏదిఏమైనా ఈ దోపిడి సమాజం నుండి విముక్తం కావడానికి మతం మార్గం కాదు అని ప్రజలు తమ జీవితానుభావాల నుండి నేర్చుకున్నారు, నేర్చుకుంటున్నారు. ఆర్.యస్.యస్ చెప్పే హిందూరాజ్యమే పరిష్కారమయితే హిందూకార్మికులని హిందూపెట్టుబడిదారుడు దోచుకోకుండా అవమానించకుండా ఉండేవాడు. భూస్వాముల చేతిలో ఏదళితుడూ అత్యాచారాలకూ, హత్యలకూ గురయ్యేవారుకాదు. దోపిడికి-పీడనకు మతం అడ్డంకి కాదని జనం అర్థం చేసుకుంటారు.

అయితే ఆర్.యస్.యస్ దాని ముసుగు సంస్థలు, దాని రాజకీయ రూపమైన బి.జె.పి హిందూ రాజ్యస్థాపన లక్ష్యంతో ప్రజల ఐక్యతను దెబ్బతీసేలా విషప్రచారాలూ, హింసాత్మక దాడులు, వైషమ్యాలు పెంచి పోషించి, అందివచ్చిన అధికారం అండతో ఈపని మరింత చురుకుగా కొనసాగిస్తున్నది. ఈ దేశంలో రక్తపాతం సృష్టిస్తూ

ఉంది. ప్రజలు తమకు ఇచ్చిన అధికారం సమాజం మూలలంటా చొచ్చుకు పోయి ప్రజాస్వామ సంస్థలను కూల దోసి, తమ పాలనను ఏదో ఒకరకంగా కొనసాగించే పరిస్థితులను తయారు చేసుకోవాలని చూస్తున్నది. విష భావజాలాన్ని సమాజం నరనరానా ఎక్కించడానికి పనిచేస్తా ఉంది. ఆరునూరైనా ఈ అవకాశాన్ని వదులుకోవడానికి అది సిద్ధంగా లేదు. కాని ప్రజలు ఆర్.యస్.యస్ ఆటలు అట్టేకాలం సాగనియ్యరు. ఇది తథ్యం. ఇదే రేపటినిజం.

❖

# జాతీయోద్యమం - ఆర్ఎస్ఎస్ పాత్ర

*నళిని తనేజా*

మహాత్మాగాంధీ హత్యానంతరం దేశమంతటా వెల్లువెత్తిన ప్రజాగ్రహాన్ని దృష్టిలో ఉంచుకుని నాటి నిషేదం ఎత్తివేయించుకోవడానికి, అప్పటికే ప్రజల్లో దెబ్బతిన్న ప్రతిష్టని దృష్టిలో ఉంచుకుని ఆర్.ఎస్.ఎస్ రాజకీయ సంస్థకాదు నిజానికి ఒక సామాజిక సాంస్కృతిక సంస్థ అని ప్రకటించుకోవలసి వచ్చింది. ఇది ముఖ్యంగా అనేక రాజకీయ అనుబంధాలున్న ఒక సామాజిక సాంస్కృతిక సంస్థ. దాని ఫాసిస్టు ఎజెండా అయిన హిందూ రాష్ట్ర స్థాపనకు పునాది దాని రోజువారి నిర్వహించే సాంస్కృతిక క్రియాశీలత.

ఆర్.ఎస్.ఎస్ దృష్టిలో ఈ దేశాన్ని హిందూరాజ్యంగా మార్చడం ద్వారానే సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించినట్లు లెక్క. ఈ లక్ష్యం తోనే 1925లో ఆర్.ఎస్.ఎస్ ఆవిర్భవించింది. 'రాజ్యం పౌరుల రాజ్యం' అనేది నానుడి. కాని ఆర్.ఎస్.ఎస్ దృష్టిలో రాజ్యం అంటే బ్రాహ్మణాధిపత్యం లో సాగే వర్ణాశ్రమ ధర్మ స్థాపనయే.

'జాతి' అంటే ఆర్.ఎస్.ఎస్ దృష్టిలో సైనికీకరణ చెందిన దేశం; సంపూర్ణంగా అగ్రవర్ణాల అధిపత్యంతో కూడిన కులీన దృక్పధమే. స్వాతంత్ర్యం రాకముందు నుండే వారి ప్రాపంచిక అవగాహన అలా ఉండేది. కాలం మారినా దాని దృక్పధంలో ఏ మార్పు లేకపోవడానికి నిదర్శనం పండగలు తతంగాలలో అది మతాన్ని జొప్పించడం; ఆవుని, జనాభా లెక్కలని, మతమార్పిడులను, ఆహార అలవాట్లను, ఆలయాలని అన్నింటినీ వివాదాస్పదం చెయ్యడం. లౌకిక దృక్పధం

కలిగిన చరిత్రను అవహేళన చెయ్యడం వంటి అన్ని కార్యకలాపాలలో మనం గమనించవచ్చు. జాతీయోద్యమ కాలం అంతటా ఈ మత శక్తులు ఇదే ధోరణితో పనిచేసాయి. వీటి ఆధారంగానే మితవాద హిందూత్వశక్తులు ఉవ్వెత్తున జాతీయోద్యమం సమయంలో ప్రజలను సంఘటితం చేసాయి.

20వ శతాబ్దంలో యూరప్ దేశాల్లో అటు దుందుడుకు జాతీయవాదం ఇటు సోవియట్‌లో కార్మిక వర్గ విప్లవం జయప్రదమైన నేపధ్యంలో మనదేశంలో ఆర్.యస్.యస్ ఊపిరి పోసుకుంది. ఆనాడు ప్రపంచవ్యాప్తంగా అనేక వలసదేశాల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు, స్వాతంత్ర్య ఉద్యమాలూ ఊపందుకున్నాయి. అదే కాలంలో పచ్చి నియంతృత్వ, ఫాసిస్టు ధోరణులూ ప్రబలంగా ముందుకొచ్చాయి.

అయితే 1917లో రష్యాలో జయప్రదమైన అక్టోబర్ మహావిప్లవం చారిత్రకంగా చాలా ప్రభావం కలుగచేసింది. భగత్‌సింగ్, తన సహచరులు, ఇతరేత అభ్యుదయ శక్తులు, సోషలిస్టు కమ్యూనిష్టు గ్రూపులు ఆఖరికి కాంగ్రెస్ పార్టీలోని కొన్ని సెక్షన్లు కూడా రష్యన్ విప్లవంతో ప్రభావితం అయ్యాయి.

కాని ఆర్.యస్.యస్ ఇందుకు భిన్నంగా ఇటలీ, జర్మనీ దేశాలలో అధికారంలోకి వచ్చిన పాసిస్టు శక్తులని, వాటి నియంతృత్వ ధోరణులని, జాత్యహంకారాన్ని, పుణికి పుచ్చుకుంది. గతవైభవాన్ని పునరుజ్జీవింప చెయ్యాలనే లక్ష్యానికి అనుగుణంగా– ఆర్యజాతి సిద్ధాంతాన్ని ముందు పెడుతూ పచ్చి తిరోగమన పూరితమైన సామాజిక–రాజకీయ అజెండాను తలకెత్తుకుంది. భారతీయ సమాజంపట్ల చరిత్ర పట్ల వలసవాదుల దృక్పథాన్ని అలంబనగా చేసుకుని జాతి పునరుజ్జీవనం కోసం కంకణబద్ధులైన మరికొన్ని సెక్షన్లు కూడా ఆర్.యస్.యస్‌తో కలిసాయి. వామపక్షాల సామాజిక దృక్పథాలకు పూర్తిగా భిన్నమైన 'జాతి' భావనను ఆర్.యస్.యస్ ప్రచారంలోకి తెచ్చింది. ఈ 'జాతి' భావనలో దేశంలో 'మెజార్టీ'గా ఉన్న కార్మికవర్గానికి, కష్టజీవులకు సంబంధించి సముచిత ప్రస్తావనేలేదు. జాతీయోద్యమ కాలంలోనే దేశం నలు చెరగులా వెల్లువెత్తిన (ఆధిపత్య) కుల వ్యతిరేక ఉద్యమాలు, వామపక్ష భావజాలానికి పెరుగుతున్న ఆదరణలను కట్టడి చెయ్యడానికి, కులవ్యవస్థ–వర్ణాశ్రమ ధర్మాల కొమ్ముకాయడానికి పుట్టుకువచ్చిందే ఈ

ఆర్.యస్.యస్.

1920–30వ దశకాల్లో వలస పాలన వ్యతిరేక ఉద్యమాలు వెల్లువలా సాగాయి. సహాయనిరాకరణోద్యమం మొట్టమొదటి దేశవ్యాప్త ఆందోళనగా మనం చెప్పుకోవచ్చు. 1924లో స్థాపించబడిన హిందూస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్ సంస్థ పేరులో హిందూస్థాన్ ఉన్నప్పటికీ ఆ సంస్థ ప్రణాళిక విప్లవకర భావాలతోను, లౌకిక తత్వం పట్ల నిబద్ధతతోను ఉంది. కాని 1925లో స్థాపించబడిన ఆర్.యస్.యస్, దాని రాజకీయ అనుబంధ సంస్థలు లౌకిక గణతంత్ర రాజ్యానికి భిన్నంగా, హిందూస్థాన్, అంటే కేవలం హిందువుల రాష్ట్రం, మనుస్మృతి రూపొందించిన కుల ప్రాతిపదికన అణచివేతలున్న ఒక ఆదర్శవంతమైన రాజ్యం ఏర్పాడాలని కోరుకుంది. హిందూమహాసభ హిందూరాజ్యాన్ని స్థాపించాలన్న లక్ష్యాన్ని ఏర్పరుచుకుంది. దేశంలో పౌరులందరూ సమానమే అన్న లౌకికభావనను తిరస్కరించింది.

అంతేకాదు ఆర్.యస్.యస్ ఒక సంస్థగా ఉనికిలోకి వచ్చిన రోజు నుండి సామాజిక ఉద్రిక్తతలు, రగిలించడానికి రోజుకొక వివాదాస్పద అంశాన్ని లేవనెత్తడమే పనిగా పెట్టుకుంది.

గోరక్షణ సమితులను విస్తరిస్తూనే దాని పవిత్రతను కాపాడేందుకు పోరాడే భక్తులను సంసిద్ధం చేసింది. దౌర్జన్య భరితమైన, శక్తివంతమైన ఈ గోవధన వ్యతిరేకించే ప్రచారం ముస్లింలకు వ్యతిరేక ప్రచారంగా మారిపోయింది. ఈ సంస్థలు ఆనాటి నుండి ఈ నాటి వరకు బ్రిటిష్ వలస ప్రభుత్వం తీసిన జనాభా లెక్కలలో ఉన్న మతగణాంకాలను ఆధారం చేసుకుని మతమార్పిడులు విపరీతంగా ప్రోత్సహిస్తున్నాయి. హిందూమతం ప్రమాదంలో పడిపోయింది అని ప్రచారం చేస్తున్నాయి. ఇంకొన్నాళ్ళకి ఈ దేశంలో హిందువులు మైనారిటీలుగా మారిపోతారనే ప్రచారం లంకించుకొని "శుద్ధి" కార్యక్రమాలు చేపట్టింది. ఇప్పటికి దాదాపుగా వందేళ్ళు గడిచాయి నాడు ఆర్.యస్.యస్ హిందూ మహాసభ, ఆ తర్వాత జనసంఘ్‌లు ప్రచారం చేసినట్టు దేశంలో హిందువులు మైనారిటీలుగా మారిపోలేదు. ఐనా 2011జనాభా గణన వివరాలనుండి ఈ వాదనలకు అనుకూలమైన లెక్కల్లో

కొన్ని మీడియాకు లీకు చేసి తిరిగి "ఘర్‌వాపసీ" కార్యక్రమాన్ని ఎత్తుకున్నాయి ఆర్.యస్.యస్ అంటుకొమ్మ సంస్థలు.

అలానే మత ఉద్రిక్తతలు సృష్టించడానికి సరిగ్గా మసీదులలో నమాజ్ చేసే సమయానికి ఆ మసీదు మీదుగా ప్రదర్శనలు తీయడం, మసీదు ముందు పెద్దగా బ్యాండ్‌బాజాలు వాయించడం, మసీదులలోకి పంది కళేబరాలను, ఆలయాలలోకి ఆవు కళేబరాలను చేర్చి, ఎదుటి మతం వారు చేసిందే అంటూ విషప్రచారం చేసి మత కలహాలు సృష్టించడం ఆర్.యస్.యస్ అనుంగు సంస్థలకి వెన్న తో పెట్టిన విద్య.

హిందువుల 'స్వర్ణయుగం' గురించి, మొఘల్ పరిపాలనా కాలంలో సాగిన ముస్లిమ్ అకృత్యాలను గురించి, ముస్లిం రాజుల కాలంలో ధ్వంసమైన ఆలయాల గురించి, 'విదేశీపరిపాలనకు వ్యతిరేకంగా వెయ్యేళ్ళపాటు(?)సాగిన పోరాటంలో అమరులైన వారి గురించి 1920లలో పెట్టిన గీతా ప్రెస్ నుండి పుంఖాను పుంఖాలుగా పుస్తకాలు అచ్చొత్తి వదులుతుంటారు. ఇక కరపత్రాలకు లెక్కేలేదు. హిందూపాంచే అనే పత్రిక వెలువరించారు. 1940ల నాటికి అనేక భాషలలో ఆర్.యస్.యస్ పత్రికలు వెలువడనారంభించాయి. ఆ తరువాత మొదలయిన వార్తా పత్రికల శకంలోనూ తమదైన ముద్ర చూప్పించేలా అన్నిరకాల కృషి చేసారు. హిందీ-హిందూ-హిందూస్థాన్ పదాల వాడకం ఎంత విరివిగా చలామణిలోకి తెచ్చారో ఉర్దూ-ముస్లిం-పాకిస్థాన్ అనే నుడికారాన్నీ అంతే విరివిగా విద్వేషపూరితంగా ప్రచారంలోకి తెచ్చారు. ఆర్.యస్.యస్ దృష్టిలో 'హిందూజాతి' అంటే ఏమిటో వివిధ తరగతుల ప్రజానీకంలోకి తీసుకువెళ్ళడానికి మహిళలకోసం ప్రత్యేకంగా రాష్ట్రీయ సేవికాసమితితో సహ అనేక విద్యార్థి-యువజన విభాగాల అనుబంధ సంస్థలను ఏర్పాటుచేసింది. సంఘాలన్నీ నిచ్చెనమెట్ల కులవ్యవస్థని గట్టిగా సమర్దిస్తాయి. కులవ్యవస్థని గట్టిగా సమర్థిస్తూనే 'హిందూఐక్యత' ద్వారా ప్రయోజనాలు పొందాలనుకున్నారు. కాంగ్రెస్ పార్టీ వేదకాలపు భారత్‌ను సాకారం చెయ్యలేదని బలంగా నమ్మారు భారతదేశ చరిత్ర పట్ల వలసవాద దృక్పధానికే వంత పాడుతూ వచ్చిన ఆర్.యస్.యస్ శక్తులు ఇవాళ సైన్సు నుండి సంస్కృతి

వరకు అన్నీ మనదేశంలోనే పుట్టాయనే వాదన వ్యాప్తి చేస్తా ఉన్నాయి.

స్వాతంత్రోద్యమంలో ఆర్.యస్.యస్ క్యాడర్‌గానీ హిందూమహాసభగానీ ఏనాడూ భాగస్వామిగా లేవు. ఇందుకు భిన్నంగా దేశంలో ఉన్న ముస్లింలలో మెజార్టీ ప్రజానీకం దేశ స్వాతంత్రోద్యమంలో పాలు పంచుకున్నారు. అయినా గానీ హిందూత్వ శక్తులు ఆనాటి నుండి ఈనాటి వరకు ముస్లిమ్‌లను ఈదేశానికి శత్రువులుగా చిత్రీకరిస్తున్నాయి. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో గానీ, సహాయ నిరాకరణోద్యమంలో గానీ, పౌర ఉల్లంఘన ఉద్యమంలోగానీ, క్విట్ ఇండియా ఉద్యమంలో గానీ లక్షలాది మంది ముస్లిమ్‌లు పాల్గొనడమేకాదు; వేలాదిమంది జైలుజీవితం అనుభవించారు; మరెంతో మంది ప్రాణాలు అర్పించారు. 1857 సిపాయి తిరుగుబాటు తర్వాత చోటు చేసుకున్న అతి పెద్ద తిరుగుబాటు 1915 సింగపూర్ తిరుగుబాటు. 'గదర్' ఉద్యమంతో ప్రేరణ పొందిన ముస్లింలతో కూడిన 15వ పదాతిదళం ఈ తిరుగుబాటులో ప్రధానంగా పాల్గొన్నారు. ఈ తిరుగుబాటులో పాల్గొన్న 49 మందిని ఎలాంటి విచారణ లేకుండా బ్రిటిష్ ప్రభుత్వం అతి కిరాతకంగా కాల్చి చంపేసింది. ముజఫర్ అహ్మద్, అష్ఫాఖుల్లాఖాన్, హజత్‌మెహానీ, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, ఆసఫ్ అలీ, సైపుద్దీన్ కిచ్‌ల్యూ, బద్రుద్దీన్ త్యాబ్రి వంటి ముస్లిం ప్రముఖుల పేర్లు ఇవాళ ప్రతి ఇంటా చిరపరిచయం కావడానికి స్వాతంత్ర్యోద్యమంలో వారు పోషించిన అనన్యసామాన్యమైన పాత్రయే కారణం.

కేవలం బ్రిటిష్ సామ్రాజ్యవాద పరిపాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్రోద్యమంలో బ్రిషిష్ పాలనకు వ్యతిరేకపోరాటానికే పరిమితం కాకుండా కార్మికులని, రైతులని సంఘటితం చేసి ఆ పీడక శక్తులకు వ్యతిరేకంగా అనేక మిలిటెంటు పోరాటాలు నిర్వహించిన కమ్యూనిష్టులను వాస్తవానికి దేశద్రోహులుగా ప్రచారం చేస్తుంది ఆర్.యస్.యస్. ఆ స్వాతంత్రోద్యమంలో ఎన్న దగ్గ పాత్ర పోషించారు ఆ కమ్యూనిష్టులు. 1921లో అహమ్మదాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సదస్సులో కమ్యూనిష్టులయిన మౌలానా హజ్రత్ మొహానీ, స్వామి కుమారానందలు ఇరువురే 'సంపూర్ణ స్వరాజ్యం' కావాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తెబాఘా,

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాలకు, వర్లి ఆదివాసుల తిరుగుబాటుకు నాయకత్వం వహించింది కమ్యూనిష్టులే.

కమ్యూనిష్టుపార్టీ ఆవిర్భావ దశ నుండే బ్రిటిష్ వలస ప్రభుత్వ అణచివేతకు గురయిన పార్టీ. 1920వ దశకంలో కమ్యూనిస్టుల మీద అనేక కుట్ర కేసులు బనాయించారు. మీరట్ కుట్ర కేసు, పెషావర్ కుట్రకేసు అందులో ప్రధానమైనవి. ముజఫర్ అహ్మద్ తదితర కమ్యూనిష్టు నాయకులకు జీవితఖైదు శిక్షలు పడ్డాయి. అదే కాలంలో హిందూ మహాసభ, ఆర్.యస్.యస్ గణనాయకులు, క్యాడర్ పోషించిన పాత్ర ఏమిటి? ఆర్.యస్.యస్ ప్రచురించి పంపిణీ చేసే విద్యాభారతి పాఠ్యపుస్తకాల్లో వినాయక్ దామోదర్ సావర్కర్‌ను 'వీర సావర్కర్'గా ప్రస్తుతిస్తూ అనేక కథనాలు అచ్చొత్తారు. అలాంటి 'వీరుడు' బ్రిటిష్ పాలకులకు 'క్షమాపణపత్రం' రాసిచ్చిందే గాక వారితో షరీకయ్యాడు కూడా. 1857 సిపాయిల తిరుగుబాటు గురించి ఒక పుస్తకం రాస్తూ (1907లో ప్రచురణ)"శతాబ్దాల తరబడి నెలకొని ఉన్న ఘర్షణకు, విదేశీ(ముస్లిమ్) పాలనకు వ్యతిరేకంగా హిందూ-ముస్లిమ్‌లు ఒక్కటయిన సందర్భం ఇది" అని వివరించారు. అదీ 'వీర' సావర్కర్ అవగాహన. స్వాతంత్రోద్యమంతో తెగతెంపులు చేసుకున్నట్లు 1913లో అధికారికంగా బహిరంగ ప్రకటన చేసాయి ఈ హిందూత్వశక్తులు. అండమాన్ జైలునుండి విడుదల కావడానికి 'ఇహ మీదట సత్ప్రవర్తన కలిగి ఉంటామని' బేషరతు క్షమాపణ పత్రం రాసిచ్చాడు. 'వీర' సావర్కర్. 'అండమాన్ లో కఠిన శిక్షలు' పేరిట ఆర్.సి. మజుందార్ రాసిన పుస్తకంలో ఇందుకు సంబంధించిన పూర్తి పాఠం ఉంది. (1995 ఏప్రిల్ 7 'ఫ్రంట్ లైన్' సంచిక 94వ పేజిలో ఉత్తరం కాపీని ముద్రించారు.) 1924లో రాసిన 'హిందూత్వ' పుస్తకంలో అడుగడుగునా ముస్లిమ్ మైనార్టీలను శత్రువులుగా చిత్రీకరిస్తూ రాజకీయాలని, సైన్యాన్ని హిందూత్వ బాట పట్టించాలని పిలుపునిచ్చాడు. బ్రిటిష్ పాలకులతో షరీకయిన మూలానే స్వాతంత్రోద్యమంలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను వ్యతిరేకించే వైఖరి చేపట్టారు. కాంగ్రెస్ పట్ల రాజకీయంగా తమకు ఉన్న వ్యతిరేకతను అందుకు కారణంగా చెప్పుకునేవారు. హిందూమహాసభ సదస్సులో అధ్యక్షోపన్యాసం చేస్తూ 'ద్విజాతి' సిద్ధాంతాన్ని బలపరచడానికి గర్వపడుతున్నానని ప్రకటించారు.

గాంధీజీ హత్యకేసులో ముద్దాయి ఈ 'వీర' సావర్కర్ తగిన సాక్ష్యాధారాలు లభించని కారణాన శిక్ష పడకుండా తప్పించుకున్నాడు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన 'క్విట్ఇండియా' ఉద్యమకాలంలో వాజ్పాయ్ కూడా ఇలానే 'అప్రూవర్'గా మారి చాలా మంది స్వాతంత్రోద్యమ నాయకుల కార్యకర్తల అరెస్టుకు సహకరించారు. (చూడండి ఫ్రంట్లైన్ వాల్యూం 15.నెం.బ 1998 ఫిబ్రవరి 7- చి సంచిక మానిని ఛటర్జీ -వికె రామచంద్రన్ల వ్యాసం)

జాతీయోద్యమకాలంలో ఆర్.యస్.యస్ పోషించిన పాత్ర అంతా వీలయినన్ని చోట్ల మత కలహాలు, అల్లర్లు సృష్టించడమే. తమ ద్విజాతి సిద్ధాంతానికి అనుగుణంగా 'అంతర్గతశత్రువుల' (ముస్లింమైనార్టీలు) కు వ్యతిరేకంగా భావజాల రంగంలో నిరంతరం కలుషిత ప్రచారానికి తెగబడేది. ఇదంతా చరిత్రలో నమోదయిన ఆర్.యస్.యస్ అసలు రూపం. ఇవాళ అది వేషం, భాషలు మార్చినా దాని అసలు రూపం దాచాలనుకున్నా దాగని వాస్తవం.

మూంజీ, మదన్మోహన్ మాలవ్య, లాలా లజపతిరాయ్, శ్యాంప్రసాద్ ముఖర్జీ, యస్.బి.ఖరే తదితరులు అటు కాంగ్రెస్లోను ఇటు హిందూమహాసభలోను ద్వంద్వ సభ్యత్వం కలిగి ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో హిందూత్వ దృక్పథాన్ని, హిందూత్వవాద పరపతి పెరిగేలా కృషి చేసిన మితవాద పక్షంగా పనిచేసారు. వీళ్ళంతా కాంగ్రెస్ పార్టీలో నెహ్రూ ప్రభావాన్ని, సోషలిస్టుల ప్రభావాన్ని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. మహారాష్ట్రలోని నాసిక్-నాగపూర్ ప్రాంతంలో 1937లో భోంస్లా సైనిక స్కూలు స్థాపించడంలో ఆర్.యస్.యస్, హిందూమహాసభలు కీలకంగా వ్యవహరించాయి. హిందూత్వ క్యాడర్ను తయారు చేసుకోవడంతో పాటు హిందువులను బ్రిటిష్ సైన్యంలో చేరేందుకు ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ సైనికస్కూలు పనిచేసింది. 'ప్రిన్స్లీస్టేట్స్' గా ఉన్న రాజ్యాలను చేజిక్కించుకోవడం, సైన్యంలో జొరబడటం వ్యూహంగా ఈ స్కూలుని నడిచింది. ఫాసిస్టు నాజీలను పోలిన శిక్షణ గడిపింది. మీలో ఎవరైనా గోల్వాల్కర్ రచనలలో 'మనము మన జాతీయత నిర్వచనం, పాంచ జన్యము అన్న పుస్తకాలు చదివి ఉంటే - హిట్లర్ ముస్సోలినీల ఆలోచనలే ఈ పుస్తకాలకి స్ఫూర్తి అని ఇట్టే పసిగట్టేయగలరు.


నిజానికి ఆర్.యస్.యస్ జర్మనీ, ఇటలీ దేశాలలోని ఫాసిస్టు సంస్థలతో సంబంధాలు నెలకొల్పుకుంది. 'ప్రిన్స్‌లీ స్టేట్స్‌గా ఉన్న రాష్ట్రాల్లో ముస్లిమ్‌లపై అమానుష హత్యాకాండలు, చోటు చేసుకున్నాయి. ఈ హత్యాకాండలు అన్నింటా ఆర్.యస్.యస్ హిందూ మహాసభల హస్తం ఉందని అనేకమంది పరిశోధకులు నమోదు చేసారు. (హైదరాబాద్, జమ్ము, అల్వార్–భరత్‌పూర్–మేవార్. పటియాలా తదితర చోట్ల రేగిన మతకలహాలు) ఢీల్లీలో ఈ శక్తుల ఉనికి బలంగా ఉండడంతో దేశవిభజనకు ముందే ఈ ప్రాంతంలో వేలాది ముస్లిమ్‌లను ఊచకోతకోసి, మిగిలిన వారిని భయభ్రాంతులను చేసి వారు దేశం విడిచి వెళ్ళేలా చేసారు. పోలీసు, అధికార యంత్రాంగంతో కుమ్మక్కయిన హిందూత్వ శక్తులు ఇంతకు బరి తెగించాయి. ఢిల్లీ అనే కాదు బెంగాల్, పంజాబ్ ప్రాంతాలలో ఆర్.యస్.యస్ మూకలు ముస్లిమ్‌ల ఊచకోతకు పాల్పడ్డాయి. ధన్వంతరి–పిసిజోషిలు ఉభయులూ రక్తమోడుతున్న పంజాబ్ చేస్తున్న హెచ్చరిక పేరిట రూపొందించిన నివేదికలలో ఆర్.యస్.యస్ కార్యకలాపాలను అక్షర బద్ధం చేసారు. తెభాగా భూపోరాటం, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం, వొర్లి ఆదివాసుల తిరుగుబాటు, నావికాదళ తిరుగుబాటు, పున్నప్ర వాయలార్ వంటి సమరశీల పోరాటాలు ముందుకొచ్చి "విప్లవం వర్ధిల్లాలి" అన్న నినాదం దేశం నలుచెరగులా విస్తరిస్తున్న నేపథ్యంలో 'దేశభక్తుల ఆగడాలు–అల్లర్లు' వారు సృష్టించిన మతకల్లోలాలు చోటు చేసుకోవడం యాదృచ్ఛిక పరిణామలేమికాదు. దేశంలో ముస్లింలీగ్ కూడా విస్మరించలేని ఒక రాజకీయశక్తిగా ముందుకు రావడంతో దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ముందు కొంతకాలం విభజన రాజకీయాలు ముందుకు రావడం, పాకిస్థాన్ ఏర్పాటు కోసం డిమాండు ఊపందుకోవడం గడిచిన చరిత్ర.

1946–51 మధ్య కాలమంతా ఆర్.యస్.యస్ ముస్లిమ్‌ల పట్ల విద్వేషాన్ని రగిలిస్తూ, దేశవిభజనకు గాంధీ, నెహ్రూ, అంబేద్కర్‌లు, కమ్యూనిస్టులే కారణమనే నిందా ప్రచారాన్ని సాగించింది.

1951లో జనసంఘ్‌ను ఏర్పాటు చెయ్యడం ద్వారా ఆర్.యస్.యస్ తన రాజకీయ దుకాణం తెరిచింది. గాంధీ హత్యానంతరం హిందూత్వ శక్తులపై ప్రజలలో

నెలకొన్న ఏహ్యత మూలంగా స్వాతంత్ర్యానంతరం జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌కు పెద్దఎత్తున పట్టం కట్టారు. ఈ ఎన్నికలలో కమ్యూనిష్టులు ద్వితీయ శక్తిగా ముందుకు వచ్చారు.

20వ శతాబ్దం అంతటా దక్షిణాసియా దేశాలలో మతఛాందసశక్తులు అనేక రూపాల్లో చలామణి అయ్యాయి–అయితే మనదేశంలో 'హిందూరాజ్యాన్ని' స్థాపించే పేరిట పనిచేస్తూ వస్తున్న ఆర్.యస్.యస్ విస్తృతిలో కాని, పరిమాణం లోగానీ వాటన్నిటిని తలదన్నేంత స్థాయిలో కొనసాగుతుంది. హిందూత్వ శక్తులు ఇచ్చేది 'ఆఖండ్‌భారత్' నినాదం. ఆ నినాదం సాకారం కావడమంటే ఈ దేశం మరొసారి విభజనకు గురికావడమే. గణతంత్ర్య లౌకిక రాజ్యంగా అవతరించిన మనదేశం ఆధునిక భారతదేశంగా ముందుకు పోవాలంటే ఆర్.యస్.యస్‌ని, దాని హిందూత్వ భావజాలాన్ని మట్టికరిపించాల్సిందే. ఆర్.యస్.యస్ చరిత్ర మొత్తం మతవిద్వేషాలు, మత విభజనలతో కూడినదే. దేశ ప్రజానీకం కుల, మత, ప్రాంతీయ, భాషా బేధాలన్నింటినీ అధిగమించి గరిష్ఠ ఐక్యతతో స్వాతంత్ర్య సాధన



కోసం కృషిచేస్తున్న రోజుల్లోనే ఆర్.యస్.యస్ మతప్రాతిపదికన ప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు నానాగడ్డీ కరిచింది. ఒక్క మాటలో చెప్పాలంటే భిన్నజాతుల, విభిన్న సంస్కృతుల సమాహారమైన భారతదేశం అంటేనే ఆర్.యస్.యస్‌కు గిట్టదు. అటువంటి మతోన్మాధ ఫాసిస్టు శక్తులకు ఎంత త్వరగా తగిన గుణపాఠం నేర్పిస్తే దేశానికి అంత మేలు జరుగుతుంది.

# ఆర్ ఎస్ ఎస్ కపటయోగ్యత

తీస్తా సెతల్వాద్

"రాజ్యం చట్టం ఏ వ్యక్తికీ సమానత్వాన్ని నిరాకరించదు లేదా భారత భూభాగంలో ఎక్కడయినా చట్టంలో సమాన రక్షణను కల్పిస్తుంది" మన రాజ్యాంగంలోని 14వ అధికరణం హామీనిస్తుంది.

కానీ ఆర్.ఎస్.ఎస్‌కు ఆది గురువయిన గోల్వాల్కర్ మాత్రం "హైందవేతరులు ఈ హిందూస్థాన్‌లో అయితే హిందూమతాన్ని ఆశ్రయించాలి లేదంటే హిందూ జాతికి పాలెగాళ్ళుగా జీవించాలి. అలాంటివారికి ఎలాంటి హక్కులూ ఉండవు. ప్రాధాన్యతలు ఇవ్వబడవు. అసలు వారికి పౌరసత్వ హక్కులే ఉండవు. ఉండకూడదు" అంటారు.

మన రాజ్యాంగంలో పొందుపరుచుకున్న లౌకిక, ప్రజాస్వామిక భావనలను ఈ మతోన్మాద, అభిజాత్య ఆలోచనలు దుంపనాశనం చేస్తాయి. దేశఐక్యతకు, సమగ్రతకు భంగం కలిగిస్తాయి. దేశం ముంగిట పొంచియున్న ఈ ప్రమాదాన్ని సరిగా అర్థం చేసుకోవాలంటే మనం ఆర్.ఎస్.ఎస్ అసలు రూపాన్ని, దాని చరిత్రను తప్పనిసరిగా అవలోకించాలి. ఆర్.ఎస్.ఎస్‌కు చెందిన రాజకీయ విభాగమే భారతీయ జనతాపార్టీ. బిజెపి నాయకత్వంలో అత్యధికులు, అలానే ఇవాళ అధికారంలో ఉన్న ప్రధానమంత్రితో సహా అనేక మంది మంత్రులు ఆర్.ఎస్.ఎస్ కుదురు నుండి వచ్చినవాళ్ళే. ఆర్.ఎస్.ఎస్‌లో తమకు ఉన్న అనుబంధాన్ని బాహాటంగా ప్రకటించుకుంటూ ఉన్నవాళ్ళు. ఆర్.ఎస్.ఎస్ పైకి

తమది ఒక సాంస్కృతిక సంస్థ అని ప్రకటించుకున్నప్పటికీ 'హిందూరాజ్య' స్థాపన రాజకీయ లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్న రాజకీయసంస్థే ఇది. బిజెపి సహా ఇతర చిల్లరమల్లర సంఘాలన్నీ ఈ లక్ష్య సాధన కోసం పాటుపడేవే.

## ఆర్ ఎస్ ఎస్ ఉద్దేశంలో జాతి

'జాతి' నిర్వచనాన్ని కూడా ఆర్.ఎస్.ఎస్ తనదైన రీతిలో వక్రీకరించింది. మనువాదం ఆధారంగా హిందూత్వ సామాజిక-ఆర్థిక వ్యవస్థని నెలకొల్పడం ఆర్.ఎస్.ఎస్ లక్ష్యం. ఈ వ్యవస్థలో శూద్రులకు, అతిశూద్రులకు మౌలిక హక్కులేమీ ఉండవు. అలాంటి దుర్మార్గమైన సమాజ నిర్మాణాన్నే 'జాతినిర్మాణం' అని 'దేశభక్తియుత కర్తవ్యం' అని గొప్పగా చెప్పుకుంటా ఉంటుంది. గోల్వాల్కర్ రాసిన 'మనం-లేక మన జాతీయత నిర్వచనం' (1938) పుస్తకం సారంశం ఐతే భయద్విహ్వలంగా, సూటిగా హిందూత్వము ప్రభోధిస్తుంది. జర్మన్ జాతి ఔన్నత్యం పేరిట హిట్లర్ చేసిన జాతుల సిద్ధాంతాన్ని భూమికగా తీసుకుని భారతదేశంలో కూడా ద్విజాతి సిద్ధాంతాన్ని, హిందూజాతి ఔన్నత్యాన్ని గురించిన సూత్రీకరణలు ఉన్నాయి ఆ పుస్తకం నిండా.

హిందూస్థాన్‌లో పరజాతీయులు (ముస్లిమ్‌లు క్రైస్తవులు) అయితే హిందూ భాషా సంస్కృతులను అనుసరించాలి. హిందూజాతి-హిందూ సంస్కృతుల ఔన్నత్యం తప్ప వేరే ఆలోచన వారి మనసులోకి రానీయకుండా చూసుకోవాలి. అంటే వారి వారి అస్తిత్వాలను వదులుకుని హిందూ జాతిలో హిందూమతంలో కలిసిపోవాలి. ఆ రకంగా మాత్రమే ఈ గడ్డ మీద జీవించాలి లేదంటే హిందూజాతి క్రింద అణిగి మణిగి ఉండాలి. ఎలాంటి హక్కులూ, ప్రాధాన్యతలు లేకుండా బతకాలి. కనీసమైన పౌరహక్కులు కూడా లేకుండా బ్రతకాలి. ఇంతకు మించి వారికి వేరే గత్యంతరం లేదు" అంటాడు గోల్వాల్కర్.

హిట్లర్ నాయకత్వంలో నాజీలు జర్మనీలో చేపట్టిన జాత్యాంహకార పరిపాలనను గోల్వాల్కర్ ఆదర్శంగా కీర్తిస్తూ ఆకాశానికి ఎత్తేసాడు. "జర్మన్ జాతి, జాతి ఔన్నత్యాలు ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశాలు అయ్యాయి. జాతి స్వచ్ఛతని, సంస్కృతిని కాపాడుకోవడానికి 'సెమిటిక్' జాతి

అయిన యూదుల పీచమణచడం ద్వారా జర్మనీ ఈ ప్రపంచాన్ని నివ్వెర పోయేలా చేసింది. జాతి ఔన్నత్యాన్ని తలమానికంగా నిలబెట్టింది. జర్మనీ, జాతులు సంస్కృతులకు సంబంధించి మూలాల్లోకంటా వెళ్ళి విభేదాలను పరిష్కరించి ఏకీకృత జాతిగా జర్మనీని మలిచిన తీరు నభూతో నభవిష్యత్ అన్న చందంగా ఉంది. హిందూస్థాన్ జర్మనీ నుండి ఆ పాఠం నేర్చుకుని లబ్ధిపొందాలి."

మార్జియా కాసొలారి అనే ఇటలీ పరిశోధకులు 1930వ దశకంలోనే హిందూ తీవ్రవాదులు ఐరోపా ఫాసిజం నుండి స్ఫూర్తి పొంది వివిధ తరగతులకు చెందిన జనాభాని శత్రువులుగా చిత్రించడం ఎలా మొదలుపెట్టారో సవివరంగా గుచ్చిగుచ్చి చెప్పారు.

హిందూ తీవ్రవాద నాయకులు హిట్లర్, ముస్సోలిని వంటి నియంతలని, ఫాసిస్టు తరహా సమాజాన్ని బహిరంగంగానే కీర్తించేవారు.

## స్వాతంత్ర్యోద్యమపోరాటం – ఆర్ ఎస్ ఎస్ పాత్ర

జాతీయత గురించి, దేశభక్తి గురించి ఇవాళ ఆర్.ఎస్.ఎస్ చేస్తున్న బాకా ప్రచారం విన్నవాళ్ళకి ఎవరికైనా దేశ స్వాతంత్రోద్యమంలో ఈ సంఘీయులు అనన్య సామాన్యమైన పాత్ర పోషించి ఉంటారు అని భావిస్తారు. అక్కడే వాళ్ళు పప్పులో కాలేసారు. ఆర్.యస్.యస్ 1925 లోనే ఆవిర్భవించినా స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ఒక్క ఎన్నదగిన నాయకుడయినా దానికి లేకపోవడం యాధృచ్ఛికం కాదు, ఎందుకంటే బ్రిటిష్ సామ్రాజ్యవాద వలసపాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్రోద్యమంలో ఆర్.ఎస్.ఎస్ శక్తులు ఏనాడూ భాగస్వామి కాలేదు.

ఆర్.ఎస్.ఎస్ నెత్తిన పెట్టుకుని పూజించే నాయకుడు వినాయక్ దామోదర్ సావర్కర్. హిందూ మహాసభ వ్యవస్థాపకుడు ఇతను. తదనంతర కాలంలో హిందూ మహాసభ నుండి వేరుపడి ఆర్.యస్.యస్‌ని స్థాపించాడు. 2002లో గుజరాత్‌లో నరమేధం జరిగిన రెండునెలలకే కేంద్రంలో అప్పుడు అధికారంలో ఉన్న యన్.డి.ఎ ప్రభుత్వం అండమాన్ విమానాశ్రయానికి ఈ వీరసావర్కర్ పేరునే పెట్టింది.

భగత్‌సింగ్, సుఖదేవ్, అష్ఫాఖుల్లాఖాన్ వంటివారు తమ జీవితాలను తృణప్రాయంగా భావించి బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులను క్షమాభిక్ష కోర నిరాకరించారు. కాని బిజెపి హిందూత్వ సిద్ధాంతానికి ఆదిగురువయిన ఈ వీరసావర్కర్ అండమాన్ సెల్యూలర్ జైలు నుండి విముక్తి కావడానికి బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్షలేఖ ఆర్జీ పెట్టుకున్నాడు.

1913 నవంబరు 14న బ్రిటిష్ ప్రభుత్వానికి సావర్కర్ రాసిన క్షమాభిక్ష లేఖలో తనని తాను బ్రిటిష్ ప్రభుత్వానికి దత్తపుత్రుడిగా అభివర్ణించుకున్నాడు. తండ్రి వంటి ప్రభుత్వం తలుపులు తడుతున్నా లోనికి అనుమతించమని' అభ్యర్థించారు. 1911లో తాను రాసిన ఉత్తరాన్ని కూడా ఉదహరిస్తూ సావర్కర్ ఇలా రాసాడు.

"ప్రభుత్వం వారి బహుముఖ ప్రయోజనాల రీత్యా దయతో నన్ను విడిచిపెడితే నేను బ్రిటిష్ సర్కారుపట్ల అత్యంత వినయ విధేయతలతో మెలుగుతా. రాజ్యాంగ సంవిధానమే అభివృద్ధికి మార్గమని బలంగా చెప్పగలిగితే ప్రభుత్వం పట్ల ఈ ప్రజలు కూడా కృతజ్ఞతలు ఆనందాతిరేకాలు ప్రదర్శిస్తారు. బంధించి ప్రతీకారం తీర్చుకోవడం కన్నా విడుదల చేసి సరైన దారిలో పెట్టడం ఉత్తమమైన పద్ధతి అని ప్రజలకు తెలుసు". పైపెచ్చు (బ్రిటిష్) రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాలన్న నా నిర్ణయం దేశంలోనూ విదేశాల్లోనూ దారి తప్పిన నవయువకులకు కూడా మార్గ నిర్దేశనం చేస్తుంది. ఈ ప్రభుత్వం నా సేవలు ఎలా ఉపయోగించుకోవాలని భావిస్తే అలా నడుచుకోవడానికి నే సిద్ధంగా ఉన్నాను. నేను ఇదంతా పూర్తి జ్ఞాతితో రాస్తున్నాను. కనుక నా భవిష్య నడవడి కూడా ఇదే తెలివిగా తోడుంటుందని మిక్కిలి తెలియచేసుకుంటున్నాను. నన్ను జైలులో ఉంచడం కన్నా విడుదల చేస్తే మీకు ఒనగూడే మేళ్ళను దృష్టిలో పెట్టుకుంటే మిక్కిలి ఘనతవహించిన మీరు నాకు దయా భిక్షపెట్టగలరని, మీరు మాత్రమే ఆ పని చెయ్యగలరని ఆశిస్తున్నా" అని నిస్సిగ్గుగా ప్రకటించారు.

భారత స్వాతంత్రోద్యమంలో ఆర్.యస్.యస్ అతి సిగ్గుచేటయిన పాత్ర పోషించింది. 1930-40వ దశకం అంతటా దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన అనేక ప్రజా ఉద్యమాలకు 1931లో జరిగిన శాసనోల్లింఘనానికి గాని 1942లో

జరిగిన క్విట్ఇండియా ఉద్యమానికిగాని, అజాద్ హింద్ ఫౌజ్ తిరుగుబాటుకు గాని, 1945-46 లో జరిగిన నావికాదళ తిరుగుబాటు తదనంతర నేరవిచారణ తంతుకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలకు గాని దూరంగా ఉంది. వివరమైన అధ్యయనంకోసం ఓరియంట్ లాంగ్మన్ ప్రచురించిన, ఖాకీనిక్కరు కాషాయధ్వజాలు' అన్న పుస్తకం చూడండి.

అన్ని మతోన్మాద సంస్థల మాదిరిగానే ఆర్.యస్.యస్ కూడా 1946-47 లో ప్రత్యేక కార్యాచరణలకు జిన్నా ఇచ్చిన పిలుపు తదనంతరం జరిగిన మతమారణహోమం పిదప బలపడింది. 1946 ఆగష్టులో కొలకత్తా మారణకాండ అనంతరం గాంధీ నిస్పృహకు లోనయిన స్థితి తమ అత్యుత్తమ క్షణాలుగా ఆర్.యస్.యస్ చెప్పుకుంటుంది.

**క్విట్ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించిన ఆర్ ఎస్ ఎస్, హిందూమహాసభ**

ఇవాళిటి భారతీయ జనతాపార్టీ ఏ జనసంఘ్ పార్టీ కుదురులోంచి పుట్టుకు వచ్చిందో ఆ జనసంఘ్ వ్యవస్థాపకుడు, ముస్లిమ్ లీగ్ సభ్యుడయిన ఫజల్ హక్ నాయకత్వాన నడుస్తున్న నాటి బెంగాల్ ప్రభుత్వంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆర్ధిక మంత్రిగా పనిచేసారు. మహాత్మాగాంధీ క్విట్ఇండియా నినాదం ఇచ్చిన నేపథ్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ బెంగాల్ ప్రభుత్వం నుండి వైదొలగలేదు సరి కదా అసలీ ఉద్యమాన్నే వ్యతిరేకిస్తూ ప్రతిపాదన ముందుకు తెచ్చారు.

ఈ ఉద్యమాన్ని (క్విట్ఇండియా) బెంగాల్లో ఎదుర్కొవడం ఎట్లా? కాంగ్రెస్ శక్తియుక్తులన్నీ వినియోగించినా ఈ బెంగాల్ ప్రోవిన్షియల్ ప్రాంతంలో ఉద్యమం విఫలం చేసేందుకు అధికారయంత్రంగం అన్ని విధమైన చర్యలూ చేపట్టాలి. బాధ్యతాయుతమైన మంత్రులుగా మనం ప్రజలకు తెలియచెప్పాలి. ఏ స్వాతంత్ర్యం కోసమని కాంగ్రెస్ పార్టీ ఈ ఉద్యమం మొదలు పెట్టిందో ఆ స్వాతంత్ర్యానికి మనం ప్రతినిధులమని ప్రజలకు నచ్చచెప్పాలి. అత్యయిక పరిస్థితులో ఈ స్వాతంత్ర్యం కాస్త పరిమితంగా ఉండొచ్చు. అయినా భారతీయులు బ్రిటిష్ వారిలో నమ్మకం ఉంచాలి. అదేదో బ్రిటన్ అవసరాలకోసమో, బ్రిటిష్ ప్రయోజనాల కోసమో కాదు ఈ బెంగాల్ ప్రావిన్స్ స్వాతంత్ర్యంకోసం, రక్షణకోసం వారిలో

నమ్మకం ఉంచాలి. గవర్నరుగా ఈ ప్రావిన్స్‌కు మీరు రాజ్యాంగ ప్రతినిధి. మీరు మా మంత్రి మండలి సలహామేరకు నడుచుకోవాలి” అంటూ నాటి బ్రిటిష్ గవర్నరుకు లేఖ రాసారు.

సింధ్ రాష్ట్రంలో హిందూ మహాసభ, ముస్లింలీగ్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ ప్రభుత్వం పాకిస్థాన్ ఏర్పాటు డిమాండును సమర్థిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. అప్పుడు కూడా హిందూమహాసభ నాయకులకుగానీ, శ్యాంప్రసాద్ ముఖర్జీకి గానీ తమ పదవులకు రాజీనామాలు చెయ్యాలనిపించలేదు. యల్.కె. అద్వానీ తనని మలిచిన మహాపురుషుడిగా చెప్పుకునే నాటి హిందూమహాసభ అధ్యక్షుడు వీరసావర్కర్ ప్రభుత్వ పదవులలో ఉన్న హిందూమహాసభప్రతినిధులు ఎవ్వరూ రాజీనామా పెట్టాల్సిన అవసరంలేదని, తమ బాధ్యతలు యధావిధిగా నిర్వహించమని ఆదేశాలు ఇచ్చారు. 1942 ఆగష్టు 31న ఈ మేరకు ఒక తీర్మానం చేస్తూ క్విట్ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించమని పిలుపునిచ్చారు.

### ఆర్ ఎస్ ఎస్, గాడ్సేలు గాంధీ హంతకులు

2014 మే నెలలో యన్.డి.ఎ-2 ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆర్.ఎస్.ఎస్ ‘ప్రచారక్’గా రాజకీయ జీవితం మొదలుపెట్టిన పెద్దమనిషి ప్రధాని కావడంతో గాంధీని హత్యచేసిన నాథూరామ్‌గాడ్సేని వీరుడుగా ప్రచారం లంకించుకున్నాయి, ఆర్.ఎస్.ఎస్ హిందూ మహాసభలు. గ్లోబల్ హిందూ పౌండేషన్ అయితే గాడ్సేను జాతీయ నాయకుడిగా ప్రకటించాలంటూ పాఠ్యపుస్తకాలలో ఆ మేరకు పొందుపరచాలంటూ, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖకి విజ్ఞప్తి చేసింది. ఆ ఉత్తరం మొత్తాన్ని పరిశీలిస్తే గాడ్సే బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుండి దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం పోరాడిన యోధుడిగా కీర్తిస్తూ చరిత్రను వక్రీకరించేదిగా ఉంది. ఈ ఉత్తరం ప్రతి ‘సేవ్‌టెంపుల్స్.ఆర్’ హోమ్‌పేజిలోను ‘మిషన్ టు సేవ్ హిందూయిజం అండ్ హిందూ టెంపుల్స్’ వెబ్‌సైట్‌లోనూ ప్రచురించబడింది. (ప్రాజెక్ట్ ఆఫ్ గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్. యు.ఎన్.ఎ’ పేరిట ఈ సంస్థ వెలగబెడుతున్న నిర్వాకం ఇది.

2012 జూన్‌లో ఈ సంస్థ హైదరాబాద్‌లో ఒక బ్రాంచి తెరిచింది కూడా)

ప్రవాస భారతీయ సంస్థ సలహాలు విజ్ఞప్తులకు అనుగుణంగా 2014 డిసెంబరు 11న బిజెపి పార్లమెంటు సభ్యుడు సాక్షి మహారాజ్ నాధూరాంగాడ్సేను దేశభక్తుడిగా అభివర్ణించాడు. ఈ వ్యాఖ్యలపై రాజ్యసభలో అధికార బిజెపి పక్షానికి మెజారిటి లేనందున సాక్షి మహారాజ్ తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. ఇదే సాక్షి మహారాజ్ కొన్ని రోజుల క్రితం మదరసాల మీదా, ముస్లింల మీద విషం చిమ్ముతూ అనేక వ్యాఖ్యలు చేసాడు. భారతమాత సేవలో తరించడానికి ప్రతి హిందూ స్త్రీ కనీసం నలుగురు పిల్లల్ని కనాలని దబాయింపుగా మాట్లాడారు.

నాధూరాంగాడ్సేని అపరదేశభక్తుడిలా కీర్తించే ఆర్.ఎస్.ఎస్ గాంధీ గురించి ఎలాంటి విద్వేషపూరిత ప్రచారం చేస్తారో ఎవరైనా ఇట్టే ఊహించుకోవచ్చు. ఆర్.ఎస్.ఎస్ 'సత్ సంఘ్ చాలక్' గా పనిచేసిన రజ్జూభయ్యా 'అవుట్‌లుక్' పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ (1998 జనవరి 19 సంచిక) "గాడ్సే అఖండభారత్ సిద్ధాంతంతో ప్రభావితమైనాడు. అతని ఆశయం గొప్పది కాని ఆ ఆశయాన్ని సాధించడానికి అతను తప్పుదోవని ఆశ్రయించారు". అంటూ గాడ్సేని నిస్సిగ్గుగా బలపరిచాడు.

గాంధీ హత్యానంతరం ఆర్.ఎస్.ఎస్ చీఫ్‌కి నాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ రాసిన లేఖ చూస్తే దాని స్వభావం ఏమిటో ఇట్టే అర్ధమైపోతుంది. గాంధీ హత్యానంతరం ఆర్.ఎస్.ఎస్ మనుషులు మిఠాయిలు పంచిపెట్టారని పటేల్ ఎత్తి చూపాడు. దేశరాజ్ గోయర్ రచించిన 'రాష్ట్రీయస్వయం సేవక్ సంఘ్' అన్న పుస్తకంలో 1948 సెప్టెంబర్ 11న పటేల్ రాసిన లేఖ పూర్తి పాఠం పొందుపరిచాడు. ఆ లేఖ వివరాలు ఇవీ–

ఆర్.ఎస్.ఎస్ పట్ల నా అభిప్రాయాలు ఏమిటో మీకు తెలుసు. గత ఏడాది డిసెంబరులో జైపూర్‌లో ఈ ఏడాది జనవరిలో లక్నోలో జరిగిన సమావేశంలో నా అభిప్రాయాలు వివరించాను. అక్కడి జనం నా అభిప్రాయాలతో ఏకీభవించారు. మీరు ఆ అభిప్రాయాలు మన్నించి ఉంటారని భావించాను. కాని ఆచరణలో చూస్తే ఆర్.ఎస్.ఎస్ వారితోగాని, వారి

కార్యక్రమాల్లోగాని ఏమాత్రం మార్పు రాలేదు. ఆర్.ఎస్.ఎస్ హిందూ సమాజానికి నిస్సందేహంగా సేవ చేస్తుంది. మహిళలు, పిల్లల రక్షణ కోసం ఆర్.ఎస్.ఎస్ నవయువకులు పాటుపడుతూ ఉన్నారు. దాని గురించి ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన పనిలేదు. కాని ముస్లిమ్‌ల మీద దాడులకు తెగబడడం, లూటీలు–దహనాలకు పాల్పడడం మాత్రం తీవ్ర అభ్యంతరకరం. హిందూవులను సంఘటితం చెయ్యడం వారికి సాయపడడం ఒక పద్ధతి, అయితే వాళ్ళ కష్టాలకి బాధ్యులు అని బదులు తీర్చుకునే పేరిట అమాయక నిస్సహాయస్థితిలో ఉన్న ఆడవాళ్ళని పిల్లల్ని మగవారినీ లక్ష్యం చేసుకుని దాడులు చెయ్యడం ఎక్కడి పద్ధతి? మీకు కాంగ్రెస్ పట్ల ఉండే వ్యతిరేకత సరే, ఇది చాలదన్నట్టు వ్యక్తిత్వం, హుందాతనం వంటి వన్నీ గాలికి వదిలేసి ప్రజల మధ్యన అశాంతిని రెచ్చగొడుతున్నారు. ఆర్.ఎస్.ఎస్ మనుషుల ఉపన్యాసాలన్నీ విషవిద్వేషపూరితంగా ఉంటున్నాయి. హిందూవుల రక్షణ కోసమే వారిని సంఘటిత పరచడానికయితే ఈ రకమైన విషప్రచారాలకు పూనుకోవాల్సిన అవసరం లేదు. ఈ విద్వేష ప్రచారం మూలంగా అత్యంత విలువైన గాంధీజీ ప్రాణత్యాగం చెయ్యాల్సి వచ్చింది. దేశమంతటా అశాంతి నెలకొన్నది. ఈ కారణానే ఆర్.యస్.యస్ మీద అటు ప్రజానీకంలోగానీ ఇటు ప్రభుత్వానికి గానీ అణువంత సానుభూతి కూడా లేదు. చెప్పాలంటే ఆర్.ఎస్.ఎస్ పట్ల వ్యతిరేకత నెలకొన్నది. గాంధీజీ హత్యానంతరం ఆర్.ఎస్.ఎస్ మనుషులు మిఠాయిలు పంచి సంబరం చేసుకోవడంతో ఈ వ్యతిరేకత మరింత పెరిగింది. ఈ పరిస్థితిల్లో ఆర్.ఎస్.ఎస్ మీద చర్య తీసుకోవాల్సిరావడం ప్రభుత్వానికి అనివార్యమయింది.

ఇదంతా గడిచి ఇప్పటికి ఆరునెలలయ్యింది. ఇప్పటికైనా ఆర్.ఎస్.ఎస్ వారు తప్పు దిద్దుకొని సరైన మార్గంలోకి వస్తారనుకున్నాం కాని ప్రభుత్వానికి అందుతున్న నివేదికలని బట్టి చూస్తే మీరు యధాప్రకారంగా మీపాత ధోరణులతో అవే దుర్మార్గాలని చెయ్యడానికి తాజా ప్రయత్నాలు మొదలుపెట్టారని అర్ధమవుతూ ఉంది.”

## భారత్ ఒక కొత్త దేశంగా ఆవిర్భావం;
## జాతి పతాకం – ఆర్ ఎస్ ఎస్ వైఖరి

రాజ్యాంగ అసెంబ్లీ త్రివర్ణ పతాకాన్ని మన దేశ జాతీయ పతాకంగా నిర్ణయించడం పట్ల ఆర్.ఎస్.ఎస్ తన అధికారిక పత్రిక (ఆర్గనైజర్‌లో (1947 జూలై 17 సంచిక ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 'జాతీయ పతాకం పేరుతో రాసిన సంపాదకీయంలో కాషాయపతాకాన్ని జాతీయజెండాగా మలచాలని డిమాండు చేసింది. "1947 ఆగష్టు 14– హిందూస్థాన్" పేరిట జూలై 31న రాసిన సంపాదకీయంలో కూడా ఇదే డిమాండ్ పొందుపరిచింది. దేశ ప్రజానీకం అంతా భారతజాతి' అన్న భావనని కూడా తృణీకరించింది. ఆగష్టు 14న రాసిన ఒక వ్యాసంలో డిల్లీ ఎర్రకోట పై కాషాయజెండా ఎగరాలి అని ప్రస్థావిస్తూనే త్రివర్ణపతాకాన్ని జాతీయ జెండాగా ఎన్నుకోడాన్ని కించపరుస్తూ ఇలా రాసారు–

"అదృష్టం కుదిరి ఇవాళ అధికారం చేపట్టిన వాళ్ళు మన చేతుల్లో ఈ త్రివర్ణ పతాకాన్ని ఉంచారు. కానీ హిందూవులు ఏనాటికీ దీన్ని స్వంతం చేసుకోరు. ఎన్నటికీ గౌరవించరు. అసలు మూడు అన్న అంకె చేటు. అలాంటిది ఈ మూడు రంగుల జెండా మానసికంగా చెడు ప్రభావం కలిగిస్తుంది. ఈ దేశానికి చేటుతెస్తుంది."

భారతదేశ భిన్నత్వాన్ని బహుళ సంప్రదాయాలని ఆర్.ఎస్.ఎస్ గుర్తించ నిరాకరిస్తుంది. 1946 జులై 14న నాగపూర్‌లో జరిగిన ఒక సదస్సులో గోల్వాల్కర్ ప్రసంగిస్తూ కాషాయ పతాకం మాత్రమే ఈ దేశపు ఘన సంస్కృతిని ప్రతిబింబిస్తుంది అన్నాడు. అది దేవుని ప్రతీక. ఏదో ఒక నాటికి జాతీయావత్తూ ఈ జెండాకి వందనం చేస్తుంది అన్న అశాభావాన్ని వెలిబుచ్చాడు.

దేశ స్వాతంత్ర్యానంతరం త్రివర్ణ పతాకం మన జాతీయ జెండాగా మారిన తరువాత కూడా ఆర్.ఎస్.ఎస్ దాని వైఖరి మార్చుకోలేదు. యన్.డి.ఎ అధికారంలోకి వచ్చిన మరుసటి ఏడాది 2000సం॥లో మాత్రమే ఆర్.యస్.యస్ కేంద్ర కార్యాలయం మీద జాతీయపతాకం ఎగురవేసారు. త్రివర్ణ పతాకాన్ని కూడా ఆర్.ఎస్.ఎస్ ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి

మాత్రమే వాడుకో నారంభించింది. ఆర్.యస్.యస్ కుదురులోంచి వచ్చిన మరో పెద్ద మనిషి మురళీ మనోహర్ జోషి 1991లో 'ఏకాతాయాత్ర' పేరిట ఆ నగర్‌లోని 'లాల్‌చౌక్'లో ప్రాంతాన్ని ముస్లిమ్‌లు 'ఈద్‌గాహ్' (ప్రార్ధనాస్థలి)గా భావిస్తుంటారు. కాబట్టి అక్కడ హిందూత్వని ప్రదర్శించడానికి ఈ పెద్దమనుషులు అక్కడికి బయల్దేరారే తప్ప త్రివర్ణపతాకం పట్ల గౌరవం గాని, దేశభక్తితోగాని కాదు. అదే "మీరు బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత అక్కడ చేరిన ఆర్.ఎస్.ఎస్ మూక ఎగరేసిన జెండా ఏమిటో గుర్తు చేసుకోండి. కాషాయ ధ్వజమేకదా. హిందువుల కేమో కాషాయ ధ్వజం,ముస్లిమ్‌లకు త్రివర్ణ పతాకం అదీ ఆర్.ఎస్.ఎస్ ద్వంద్వ నీతి.

ఆర్.ఎస్.ఎస్ చరిత్రని ఎటు తెరచి చూచినా మనకు దాని కార్యకలాపాలన్నీ భారతరాజ్యాంగపు మౌలిక పునాదులకు ప్రమాదకరంగా పరిణమించేవిగానే స్పష్టమవుతుంటాయి.

❖

# సంఘ్ పరివార్ రక్తచరిత్ర

**తీస్తా సెతల్వాద్**

మతకలహాలు ముస్లిమ్‌ల మూలంగానే మొదలవుతాయని హిందువులు ఆత్మరక్షణ కోసమే తిరగబడ్డారని హిందూత్వ కాషాయ మూకలు అదే పనిగా ఒక అబద్ధాన్ని ప్రచారం చేస్తుంటాయి. కాని ఇప్పటిదాకా దేశంలో చెలరేగిన మతకలహాల కారకులు ఎవరు అనేది నిగ్గు తేల్చడానికి అధికారికంగానే నియమించిన అనేక కమిటీలు ఆర్.ఎస్.ఎస్ ప్రధాన దోషిగా పేర్కన్నాయి. ఆ వివరాలు కొన్ని ఇప్పుడు చూద్దాం.

**1969 అహమ్మదాబాద్ అల్లర్ల విచారణకు నియమించిన జస్టిస్ జగమొహన్‌రెడ్డి కమిషన్ నివేదిక :**

1969 అహ్మదాబాద్ మతకలహాలపై నియమించిన జెస్టిస్ జగ్‌మోహన్‌రెడ్డి కమిషన్ నివేదిక నుండి..“కేవలం నిఘావర్గాల వైఫల్యమే కాదు. హింస చెలరేగకుండా అణిచివెయ్యడంలోనూ నేరపూరిత నిర్లక్ష్యం చోటు చేసుకుంది. అంతేకాదు కమిషన్ ముందుకు వాస్తవాలు రాకుండా తొక్కి పట్టే ప్రయత్నాలూ జరిగాయి. ముఖ్యంగా ఆర్.యస్.యస్, జనసంఘ్ నాయకుల ప్రత్యేక పాత్రని కమిషన్ దృష్టికి రాకుండా చేసే ప్రయత్నాలు జరిగాయి”

**1970లో భివాండీ, జల్‌గావ్, మహాడ్‌లలో జరిగిన మత అలజడులపై జస్టిస్ డి.పి.మదన్ కమిషన్ ఇచ్చిన నివేదిక :**

1970లో బివాండి, జాల్‌గావ్, మహద్‌లలో చెలరేగిన మతకలహాలపై నియమించిన జస్టిస్ డి.పి.మదన్ కమిషన్ నివేదిక నుండి “థానే జిల్లాపోలీస్

యస్.పి తనపై అధికారులకు ఇచ్చిన నివేదికలో కొన్ని హిందూత్వ శక్తులు ముఖ్యంగా ఆర్.ఎస్.ఎస్, వి.యస్.పి మనుషులు కుట్రకు తెరలేపారు. ఈ ఊరేగింపులో వాళ్ళు పాల్గొనడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం శివాజీ 'గొప్పతనానికి' నివాళి అర్పించడం కాదు. వాళ్ళ కండబలం ప్రదర్శించడం వీలయితే ముస్లిమ్‌లని ఎగతాళి చేసి మరీ రెచ్చగొట్టడం"

"జనసంఘ్ సమాజసంఘ్‌లు వెనుక ఉండి ముందు 'రాష్ట్రీయ ఉత్సవ్‌మండల్' పేరిట ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాదే (1970) శివాజీ జయంతి పేరిట భివాండీలో జరపతల పెట్టిన ప్రదర్శనకు చుట్టుపక్కల పల్లెటూళ్ళ నుండి భారీగా జనాన్ని సమీకరించారు. అందుకోసం పకడ్బందీగా పెద్ద ప్రచారం చేసారు. ఇందులో పాల్గొన్న ప్రతి వారి చేతిలో లాఠీ, ఆ లాఠీకి కాషాయ ధ్వజం ఉండేలా చూసారు. జనసంఘ్ పేరిట బ్యానర్లు పట్టుకున్నారు. ప్రదర్శన పొడుగూతా ముస్లిమ్‌లని కవ్వించే ప్రయత్నం చేసారు.

ప్రదర్శకులు ముస్లిం వ్యతిరేక నినాదాలు ఇచ్చారు. చాలా దుందుడుకు వైఖరి ప్రదర్శించారు. బనగడ్‌గల్లీ దగ్గర ఉన్న మోతిమసీదు, సుతార్‌గల్లీ దర్గారీజ్ జంక్షన్ దగ్గర ఉన్న హైదరీమసీదుల మీద గులామ్‌చల్లారు పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు.

**1971లో తెల్లిబెరీ అలజడులపై జస్టిస్ జోసెఫ్ విద్యార్థిలే విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక :**

తెల్లిచ్చేరిలో హిందువులు ముస్లింలు శతాబ్దాల తరబడి సోదర భావంతో జీవిస్తా ఉన్నారు! మోప్లా 'తిరుగుబాటు కూడా తెల్లిచ్చేరిలోని ఈ రెండు మతస్థులను విడదీయలేదు. ఆర్.ఎస్.ఎస్, జనసంఘ్‌లు ఇక్కడ ఎప్పుడయితే శాఖలు ప్రారంభించాయో నాటినుండి ఇక్కడి పరిస్థితులలో మార్పులు మొదలయ్యాయి. వారు సాగించిన ముస్లిమ్ వ్యతిరేక ప్రచారం మూలంగా ముస్లిమ్‌లు క్రమేపి ముస్లింలీగ్‌కు దగ్గరయ్యారు. ఈ రకంగా రెండు మతాలమధ్యన వైషమ్యాలు పెరగడానికి కావల్సిన భూమికనంతా ఆర్.యస్.యస్, జనసంఘ్‌లు కల్పించాయి."

**1979 లో ఏప్రిల్‌లో జంషెడ్‌పూర్‌లో జరిగిన మత అల్లర్లపై విచారణ కమిటీ నివేదిక:**

1964లో చెలరేగిన మతకలహాల తరువాత ఇతరత్రా పండుగల మాదిరి శ్రీరామనవమి నాడు శాంతి భద్రతల అధికారయంత్రాంగం మరింత కట్టుదిట్టంగా, అప్రమత్తంగా వ్యవహరిస్తూ వస్తుందని ప్రభుత్వాధికారులు వెల్లడించిన సాక్ష్యాధారాలను బట్టి తెలియవస్తుంది. ఏటా శ్రీరామనవమి ఊరేగింపుల సంఖ్య పెరుగుతావస్తూ 1979 నాటికి గరిష్టంగా 79కి చేరుతుంది. జంషెడ్ నిఘా వర్గాల నివేదిక(1979 మార్చి 23) బట్టి చూస్తే ఎన్నికలకు ముందుగా ఇలాంటి వాతావరణం తీసుకువచ్చినట్లు స్పష్టమవుతుంది.

మార్చి 31 – ఏప్రిల్ 1 తేదీలలో రెండు రోజులపాటు జరగనున్న ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ సదస్సు గురించి, అందులో సర్‌సంఘ్ చాలక్ పాల్గొనే విషయం గురించి సమాచారం ఉంది. ఊరేగింపు తీసే మార్గంలో ముస్లిములు నివసించే ప్రాంతాలు ఉన్నాయి కాబట్టి ఆ మార్గానికి అనుమతే నిరాకరించింది స్థానిక అధికార యంత్రాంగం. దీన్ని సాకుగా చూపించి ఆర్ఎస్ఎస్‌తో లింకులు ఉన్న 'సంయుక్త భజరంగ్ బలి అఖీరా సమితి' అనే సంస్థ మత భావాలను రెచ్చగొట్టేలా కరపత్రాలు వేసి ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేసింది. అధికార యంత్రాంగం నిషేధం విధించిన మార్గం గుండానే ఊరేగింపు జరపాలని, ఈ నిషేధం హిందువుల హక్కులను అణిచివెయ్యడానికే అన్న ప్రచారంతోపాటు ముస్లిం వ్యతిరేక నినాదాల హోరుతో ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టారు. శ్రీరామనవమి కేంద్రీయ అఖీర సమితి పేరిట ప్రచురించిన కరపత్రాలను జంషెడ్‌పూర్ అంతటా పంపిణీ చేశారు. కిందిస్థాయి పోలీసులు, హవల్దార్లు, హోమ్‌గార్డులు కొందరు మనకు (హిందూత్వ శక్తులకు) మద్దతుగా నిలిచారు అన్న ప్రచారం గూడా చేపట్టి నిషేదాంక్షలు ఉల్లంఘించినా ఎవరికీ ఏం కాదు అన్న ధైర్యాన్ని తెగింపుని నూరిపోశారు. ఆర్ఎస్ఎస్ శక్తుల ప్రచారం ఎంత పకడ్బంధీగా ఉండిందీ అర్థం చేసుకోవడానికి ఇదొక ఉదాహరణ. 1932లో కన్యాకుమారిలో హిందూ – క్రైస్తవుల మధ్య చోటుచేసుకున్న సుదీర్ఘ ఘర్షణలపై నియమించిన జస్టిస్ వేణుగోపాల్ కమిషన్ నివేదిక నుండి హిందువుల పేరిట

మైనార్టీలకు వ్యతిరేకంగా దుందుడుకు, హింసాత్మక చర్యలకు పాల్పడడం ఆర్ఎస్ఎస్ విధానంగా ఉంది. మైనార్టీలు ఎక్కడ ఉండాలో అక్కడ ఉండకపోతే వాళ్ళు ఎక్కడ ఉండాలనే గుణపాఠం నేర్పించడం తన విధి అని ఆర్ఎస్ఎస్ భావిస్తుంది. మత కలహాలను రెచ్చగొట్టడానికి ఆర్ఎస్ఎస్ ఎంచుకున్న పద్ధతులు ఇలా ఉంటాయి. -

1. క్రైస్తవులు ఈ దేశానికి విశ్వాస పాత్రంగా ఉండే పౌరులు కాదనే దుర్మార్గపు ప్రచారంతో మెజార్టీ మతస్థులలో అన్యమత ద్వేషం రగిలిస్తుంది.
2. నానాటికీ మైనార్టీ మతస్థుల జనాభా పెరిగిపోతూ ఉందని ఇలానే కొనసాగితే ఏదో ఒకనాటికి మెజార్టీగా ఉన్న హిందూమతం మైనార్టీకి పడిపోతుందనే ప్రచారం అతి నమ్మకంగా కావిస్తుంది.
3. అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగాలలో కూడా ఈ రకమైన భావజాలాన్ని ప్రచారం చేసి వారిలో పక్షపాత ధోరణులు నెలకొనేలా చేస్తుంది.
4. మెజార్టీగా ఉన్న హిందూ మతం లోని యువకులను చేరదీసి కర్రసాము, కత్తిసాము వంటి ఆయుధ శిక్షణ నేర్పిస్తుంది.
5. చిలువలు వలువలు ప్రచారం, పుకార్లు పుట్టించడం వంటి పద్ధతుల ద్వారా మత ఉద్రిక్తలు ఇట్టే సృష్టిస్తుంది.

1993లో ముంబైలో చెలరేగిన మత కలహాల మీద నియమించిన శ్రీకృష్ణ కమిషన్ నివేదిక బిజెపి, శివసేన నాయకులని, పోలీసుల పాత్రని ఎత్తి చూపింది. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా వ్యక్తుల మీద చట్టపరమైన చర్యలు చేపట్టలేదు.

**లిబర్హాన్ కమిషన్**

1992 డిసెంబరు 6న వేలాదిమంది ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు వారివారి నాయకుల ఆధ్వర్యాన బాబ్రీ మసీదును కూల్చివేశారు. ఈ ఘటనలపై కేంద్ర ప్రభుత్వం జస్టిస్ లిబర్హాన్ అధ్యక్షతన విచారణ సంఘం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 16 ఏళ్ళ తరువాత 2009లో ఒక నివేదిక సమర్పించింది. సంఘ్‌పరివార్ చెబుతున్నట్లు ఇదేమీ అసంకల్పితంగా, ముందస్తు ప్రణాళిక లేకుండా జరిగింది కాదని తేల్చి చెప్పింది. బిజెపి అగ్ర నాయకులైన అద్వానీ, రాజనాథ్‌సింగ్ కళ్యాణ్‌సింగ్‌లు బాబ్రీమసీదు కూల్చివేత కుట్రలో భాగస్వాములని,

దోషులని స్పష్టం చేసింది ఇప్పటికి ఆరేళ్ళు గడిచిపోయాయి కాని దోషులలో ఎవరికీ శిక్ష పడలేదు.

ఈ మొత్తం ఘటనల పరంపరని పరిశీలిస్తే మతకలహాలు రెచ్చకొట్టడంలో ఆర్ఎస్ఎస్ శక్తుల ప్రమేయం పట్ల స్పష్టమైన సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ ఇప్పటిదాకా ఎవరిమీదా కేసు పెట్టలేదు. ఎవరికీ శిక్షపడలేదు.

2002లో గుజరాత్‌లో జరిగిన నరమేధంలో 126 మంది పేర్లను దోషులుగా పేర్కొన్నప్పటికీ కేసులు నత్తనడకన నడుస్తున్నాయి. నిందితులు బెయిళ్ళ మీద బయట తిరుగుతున్నారు.

❖

# హిందూత్వ పేరిట ఉగ్రవాదం

**ఓ కూర్పు**

ఉగ్రవాదులు, ఉగ్రవాద కార్యకలాపాలూ ఈ దేశానికి ప్రజాస్వామ్యానికి తీరని చేటు చేస్తాయి. అలాంటి ఉగ్రవాదులకు, వారికి వెన్నుదన్నుగా నిలిచేవారికి వ్యతిరేకంగా ప్రజానీకాన్ని కదిలించాలి. ఉగ్రవాద గ్రూపులు ఏ మతానికి చెందినవైనా మతాన్ని రక్షించుకునే పేరిట అవి చేసే దుర్మార్గాలను అరికట్టాలి. అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి. ఉగ్రవాదానికి మతం లేని మాట నిజమే కానీ మతం పేరిటే వారు ఉగ్రవాద చర్యలకు పాల్పడుతుంటారు. ముస్లిం మతతత్వ శక్తులు కూడా అనేక దేశాల్లో అమాయక ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నాయన్నది ఎంత నిజమో ఇలాంటి అనేక ఉగ్రవాద సంస్థలకి సిఐఏ, ఇతర అమెరికా దేశ ఎజెన్సీల నుండి ఆర్థిక, ఆయుధ సహకారం అందుతున్న మాటా అంతే నిజం. ఒకనాడు రష్యాకు వ్యతిరేకంగా ప్రేరేపించిన అలాంటి ఉగ్రవాద సంస్థలే ఇవాళ అమెరికాని ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఐఎస్ఐఎస్ ఆ వరుసలో తాజా ఉదాహరణ.

ఇస్లాం దేశాలు సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక దేశాల్లోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఇలాంటి ఉగ్రవాద చర్యలను తీవ్రంగా నిరసిస్తున్నాయి.

2011 సెప్టెంబరు 11న అమెరికాలోని జంట హర్మ్యాల మీద జరిగిన దాడుల తరువాత అమెరికా ఇస్లాంకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ప్రచారం

చేపట్టింది. ముస్లింలంటేనే ఉగ్రవాదులు అనే అభిప్రాయం బలపడే స్థాయికి ఈ ప్రచారం సాగింది. 2008 నవంబరు 26న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ముంబయ్ మీద చేసిన దాడులు ఈ అభిప్రాయాలు బలపడేందుకు తోడ్పడ్డాయి. బిజెపి తాను ఉగ్రవాద కార్యకలాపాలకు వ్యతిరేకం, చట్టబద్ధంగా వాటిని అరికడతాం అని గంభీరంగా ప్రకటనలు ఇస్తుంది కానీ హిందూత్వ శక్తులు చేపట్టిన ఉగ్రవాద కార్యకలాపాల గురించి పల్లెత్తుమాట మాట్లాడదు.

ఆర్ఎస్ఎస్ అనుంగు సంస్థలైన విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, దుర్గావాహిని లాంటివి మన దేశంలో ముస్లింలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున విద్వేష ప్రచారానికి పాల్పడుతున్నాయి. హిందూత్వ ఉగ్రవాదగ్రూపులు కూడా ఉనికిలో ఉన్నాయి.

సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్ళు (2007 ఫిబ్రవరి 15), హైదరాబాద్‌లోని మక్కా మసీదు వద్ద పేలుళ్ళు (2007 మే 18), అజ్మీర్‌దర్గా షరీఫ్ పేలుళ్ళు (2007 అక్టోబరు), మలెగావ్ పేలుళ్ళు (2008 సెప్టెంబరు 29) – ఇవన్నీ వందలాది మంది అమాయక ప్రజానీకాన్ని పొట్టన పెట్టుకున్నాయి. మరెంతో మందిని వికలాంగుల్ని చేశాయి.

ముస్లిమ్‌లు ఎక్కువగా మసిలే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని హిందూత్వ సిద్ధాంతంతో ప్రేరేపితమైన హిందూ ఉగ్రవాద సంస్థలే ఈ పేలుళ్ళకు కారణమని ప్రభుత్వ వర్గాలు నిర్ధారించాయి. నాటి హోం మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.కె.సింగ్ ఈ పేలుళ్ళ నిందితులలో పదిమందికి నేరుగా ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు ఉన్నాయని, కొందరు ఆర్ఎస్ఎస్ బాధ్యతలలో ఉన్నారని పార్లమెంటులో ప్రకటించారు. ఆ తర్వాత ఈ పెద్దమనిషి బిజెపి తీర్థం పుచ్చుకున్నాడనుకోండి, అది వేరే సంగతి.

పేలుళ్ళ నిందితులను అరెస్టు చేసిన నేపథ్యంలో బిజెపి నాయకత్వం జైళ్ళలో వారిని కలిసి బయటికి వచ్చి, సాధువులను, సంతులను యుపిఎ ప్రభుత్వం అక్రమంగా నిర్బంధించిందని విమర్శించారు. వారంతా 'దేశ'భక్తులని కితాబులిచ్చింది. వారి 'దేశభక్తి' ఏపాటిదో వారి నేరపూరిత చర్యలే నిర్ధారిస్తున్నాయి. (నిందితులలో అసీమానంద

కూడా ఒకరు. కారవాన్ పత్రిక (2014 ఫిబ్రవరి) సహా అనేక పత్రికలకు ఇంటర్వ్యూలు ఇచ్చాడు ఇతను.)

82 మంది అమాయకవీరుల మృతికి కారణమైన మూడు ఉగ్రవాద దాడులలో అసీమానందకు ప్రమేయం ఉందని 'ఇన్వెస్టిగేటింగ్' (విచారణ) సంస్థలు నేరారోపణ చేశాయి. ఇంకా ఇతరత్రా అనేక దాడులలో కూడా ఇతని ప్రమేయం ఉంది. ఆర్ఎస్ఎస్ పనుపున_నడుస్తున్న వనవాసీ కళ్యాణ్‌సంఘ్ తరపున గుజరాత్ కార్యక్షేత్రంగా ఇతను పని చేస్తున్నాడు. 2005లో సూరత్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశం తరువాత మోహన్‌భగవత్ (ప్రస్తుత ఆర్ఎస్ఎస్ చీఫ్), ఇందరీష్‌కుమార్ (ఆర్ఎస్ఎస్ ప్రచారక్ మరియు సోకాల్డ్ ముస్లిం ఫ్రంట్ నాయకుడు)లు ఇరువురూ డాంగ్స్‌లీ అసీమానంద నివసిస్తున్న గుడిలోనే తనని కలిసారని, దేశంలో ఎక్కడెక్కడ ముస్లిమ్‌లను లక్ష్యంగా దాడులు చెయ్యాలనే అంశాన్ని అప్పుడే చర్చించి నిర్ణయించామని అసీమానంద పత్రికా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.

ఇంటర్వ్యూలో అసీమానంద చెప్పినదాని ప్రకారం మోహన్‌భగవత్ అతనితో "మేం ఇందులో నేరుగా జోక్యం చేసుకోం. కానీ నువ్వీ పనిచేస్తే మేం నీతో ఉన్నట్లుగానే భావించుకో. నువ్వీ పనిచేస్తే మా పని చేసినట్లే. ఇది (మన) సిద్ధాంతంతో ముడిపడి ఉన్న అంశం. హిందువులకి అవసరం. దయచేసి ఈ పని నెరవేర్చేందుకు అంగీకరించు నీకు మా ఆశీస్సులు ఉంటాయ్" అన్నాడు.

ఇంటర్వ్యూ ప్రచురించబడినాక అసీమానంద న్యాయ సహాయకుడు ఈ కథనం తప్పని ఒక ప్రకటన ఇచ్చాడు. కాని కారవాన్ పత్రిక ఇంటర్వ్యూలో ప్రతీది అక్షరసత్యం అనీ, ఇందుకు సంబంధించిన టేపులన్నీ తమ వద్ద ఉన్నాయని పత్రికా యాజమాన్యం వివరణ ఇచ్చింది.

ఆర్ఎస్ఎస్ అగ్రనాయకత్వానికి దేశంలో జరిగిన వరసవారీ బాంబు పేలుళ్లకి మధ్య ఉన్న లింకు ఏమిటో నిగ్గు తేలాలంటే రాజకీయ చిత్తశుద్ధితో మరింత లోతైన విచారణ జరిపించాలి.

**అమాయక ముస్లింమ్‌లు ఖైదు :**


ఇక్కడే వారి శక్తుల ద్వంద్వ ప్రమాణాలు మనకు కనబడిపోతాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడే పేరిట అనేకమంది అమాయక ముస్లిం యువకులను అరెస్టు చేసి ఏళ్ళ తరబడి విచారణ ఖైదీలుగా జెల్లో మగ్గబెడుతున్నారు. మాలెగావ్, మక్కా మసీదు పేలుళ్ళకి హిందూత్వ శక్తులకి సంబంధం ఉందని రూఢీ అయ్యింది. ఇంతలోగానే ఈ పేలుళ్ళకు బాధ్యులు అంటూ అనేకమంది ముస్లిం యువకులను అరెస్టు చేశారు. వీరంతా పది,పదిహేనేళ్ళు విచారణ ఖైదీలుగా జైళ్ళలో మగ్గిన తరువాత విడుదలయి బాహ్య ప్రపంచంలోకి వచ్చారు.

ఇలా అక్రమంగా ఖైదు చెయ్యబడిన ముస్లిం యువకుల వివరాలు ఈ మధ్యనే వెలుగుచూస్తున్నాయి. ఇంతటి అమానవీయమైన 'అన్యాయాన్ని' ఖండిస్తూ అటు కాంగ్రెస్ గాని, ఇటు బిజెపి గానీ పల్లెత్తుమాట అనలేదు. కేవలం సిపియం పార్టీ మాత్రమే పార్లమెంటు లోపలా, వెలుపలా ఈ అక్రమ అరెస్టులపై ఆందోళన లేవదీసింది. జరిగిన అన్యాయాన్ని భారత రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్ళింది. అక్రమ అరెస్టులకు గురయిన ముస్లిం యువకులకు ఇంకా న్యాయం అందాల్సే ఉంది.

ఈ అమాయక యువకుల జీవితాలను ఈ దుర్మార్గపు వ్యవస్థ నాశనం చేసింది.

❖

**కల్బుర్గి హత్య : ఊహా చిత్రాలు విడుదల చేసిన పోలీసులు**



## “ఆర్‌ఎస్‌ఎస్ అనేది ఒక కుటుంబం”

– గోపాల్ గాడ్సే (నాథూరం గాడ్సే సోదరుడు)

**– ఇంటర్వ్యూ భాగాలు**

ఫ్రంట్ లైన్ పత్రిక నుండి

**ప్ర : మీరూ ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉన్నారా?**

**జ :** మా అన్నదమ్ములం అందరం ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందినవారమే. నాథూరామ్, దత్తాత్రేయ, నేను, గోవింద్ నలుగురిమి. ఇంట్లో కన్నా మా పెంపకం అంతా ఆర్‌ఎస్‌ఎస్ ముంగిట్లోనే సాగింది. ఆర్‌ఎస్‌ఎస్‌యే మా పాలిట కుటుంబం.

**ప్ర : నాథూరాం ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉన్నారా? దాన్ని విడిచిపెట్టలేదా?**

**జ :** నాథూరాం ఆర్‌ఎస్‌ఎస్‌లో ‘బౌద్ధిక్ కార్యవాహక్’ (మేధో కార్యకర్త)గా తయారయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్‌ని ఏనాడో విడిచిపెట్టాను అని నాథూరాం అన్నాడంటే దానికి కారణం గాంధీ హత్యానంతరం గురు గోల్వాల్కర్, ఆర్‌ఎస్‌ఎస్‌లు అప్పటికే ఇబ్బందుల్లో ఉన్నాయి. కాబట్టి వారిని ఇంకా ఇబ్బందుల్లోకి నెట్టకూడదనే ఉద్దేశంతోనే. వాస్తవికానికి తను ఆర్‌ఎస్‌ఎస్‌ని ఏనాడూ విడిచి ఉండలేదు.

**ప్ర : నాథూరాంకి, ఆర్‌ఎస్‌ఎస్‌కి ఏం సంబంధం లేదు అని ఈ మధ్యన అద్వానీ కూడా అన్నారు కదా?**

**జ :** ఆ మాటలకి నే బదులు చెప్పాను కూడా, అవి పిరికితనంతో అన్నమాటలు. ‘వెళ్ళి గాంధీని చంపు’ అని ఆర్‌ఎస్‌ఎస్ ఓ తీర్మానం చేసి ఉండకపోవచ్చు

గాక, కానీ మీరు (ఆర్ఎస్ఎస్) అతన్ని (నాథూరాం) మావాడు కాదని వదిలించుకోలేరు. హిందూ మహాసభ అతను మావాడు కాదని చెప్పలా. 1949లో నాథూరామ్ హిందూ మహాసభలో పనిచేస్తూ ఆ క్రమంలోనే ఆర్ఎస్ఎస్‌లో 'బౌద్ధిక కార్యవాహ్' అయ్యాడు.

**ప్ర : గాంధీని చంపాలని ఎప్పుడు ప్లాన్ చేశారు?**

**జ :** (ఆర్ఎస్ఎస్ నీడలే) హిందూ రాష్ట్ర దినపత్రికలో సంపాదకుడిగా పని చేస్తున్న నాథూరామ్‌కి టెలిప్రింటర్ ఉండింది. అందులో గాంధీ ఆ మరుసటి రోజున నిరాహారదీక్ష చెయ్యనున్నాడనే వార్త చూశాడు. (పాకిస్తాన్–కాశ్మీరు దురాక్రమణ వివాదం పరిష్కరింపబడేంత వరకు భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు చెందిన 55 కోట్ల రూపాయలను స్తంభింపచెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ 55 కోట్లు భారత్–పాక్ విభజన సందర్భంగా పాకిస్థాన్‌కు చెందాల్సిన సొమ్ముగా నిర్ణయించారు. ఈ సొమ్మును స్తంభింపచేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గాంధీ నిరాహారదీక్షకు పూనుకోవాలనుకున్నాడు. ఆ వార్త చూడగానే నాథూరామ్ ఇంక దీనికి స్వస్థి పలకాలని నిర్ణయించుకున్నట్టున్నాడు.

కాని అంతకు ముందు చాలాసార్లు గాంధీని లేపెయ్యాలని ఆలోచించారు. శరణార్థ శిబిరాల్లో వారు అలా అనుకున్నారు. మనకీ ప్రారబ్ధం తెచ్చిపెట్టాడు కాబట్టి అతన్ని చంపేస్తే పోలా అని అనేక సందర్భాల్లో అనేకమంది అనుకున్నారు. ఒక్కొక్క సారి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి, ఇంక ఈ పది, పదిహేను నిమిషాల్లో వానపడొచ్చు, కుండపోత వాన అనుకుంటాం. కాని అలా జరగదు. గాలులు, ఎటునుంచి వచ్చాస్తాయోగాని మబ్బులన్నింటినీ తేల్చేస్తాయి. వాన పడాలంటే ఏం కావాలి? నిర్దిష్టమైన వాతావరణం, నిర్దిష్టమైన వేడిమి మబ్బులలోని నీటి అణువులని తాకాలి. అప్పుడు  ఆ నీటి అణువులు వర్షపు నీరుగా భూమిని తాకుతుంది. అట్లానే కుట్రలమీద కుట్రలకు పథకాలు రచించినా ఏవీ ఒక కారణాన గాలికి కొట్టుకుపోయే పేలపిండిలా ఎగిరిపోయాయి. అన్ని పరిస్థితులూ సరిగ్గా కుదరడంతో సరిగ్గా ఆ కుట్ర విజయవంతం అయ్యింది. కుట్రదారులకు సంబంధించి వారి కల నిజమయ్యింది. వారి లక్ష్యం సాధించబడింది.

**ప్ర : మీకు, సావర్కర్‌కు ఇందులో సంబంధం ఏమిటి?**

**జ :** సావర్కర్‌ని మేం గురువుగా భావిస్తాం. మా రాజకీయ గురువు ఆయన. సావర్కర్‌ని మేం పూర్తిగా అర్థం చేసుకోవడమే నిజమయితే ఈ పని (గాంధీహత్య) మేం చేయొచ్చా, చేయకూడదా అని అడగడం అవివేకం అవుతుంది. బలహీనులు మాత్రమే గురువుగారి ఆశీస్సులు కోరుకుంటారు. ఉదాహరణకు గురువుగారు "మూర్ఖుల్లారా అలాంటి పని చెయ్యొబాకండి" అంటూ మా చేతులు కట్టేసారనుకోండి ఆ తర్వాత ఆ పని వేరే వాళ్ళెవరో కానిచ్చేసారనుకోండి. అప్పుడు మేం 'అయ్యయ్యో ఆ పనేదో మేమే చేసి ఉండాల్సిందే. గురువుగారు అనవసరంగా మా చేతులు కట్టేసారే' అని వగచి ఏం లాభం. అలా చేయడమంటే మనలో భయాన్ని కప్పిపెట్టుకోవడమే. గురువుగారి పరువు గంగపాల్జెయ్యడమే.

**ప్ర : (గాంధీ) హత్యానంతరం సావర్కర్ స్పందన ఏమిటి?**

**జ :** అందరి మాదిరిగానే 'ఈ దురదృష్టకరమైన వార్త వినగానే నే మ్రాన్పడిపోయాను' అని. ఇది జనం కోసం చేసిన ప్రకటన.

**ప్ర : గాంధీ జాతీయోద్యమంలోకి హిందూ సంస్కృతిని చొప్పించడం ద్వారా ఉద్యమాన్ని మరింత విశాలపరిచాడని, ప్రజామోద పునాది వేశాడని చాలామంది నిందించడం మీరు ఎరిగి ఉంటారు కదా. దీని గురించి మీరేమంటారు?**

**జ :** అదేమాట నిజమయి ఉంటే ఈ దేశాన్ని హిందూదేశంగా ప్రకటించి ఉండేవాడు. కాని అతను అట్లా చెయ్యలేదు. అట్లానే చచ్చిపోయేముందు గాంధీ 'హేరామ' అన్నాడని కాంగ్రెస్ పుట్టించింది. నిజానికి అట్లాంటిదేం జరగలేదు. గాంధీ ప్రాణం విడుస్తూ హేరామ్ అన్నాడన్న కట్టుకథ అల్లడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మొదటిసారిగా 'రామ' శబ్దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంది.

**ప్ర : గాంధీగారు హిందూత్వకు సంబంధించి విరాటపురుష దృక్పథం నుండి కాక.. పౌరుషహీనంగా విశ్లేషించాడనే విమర్శ కొందరు చేస్తున్నారు. దీని గురించి మీరేం అనుకుంటున్నారు?**

**జ :** ఇదంతా చాలా అసందిగ్ధమైన వ్యవహారం. గాంధీ వ్యవహారశైలి ఎలా ఉంటుందంటే యుద్ధాన్ని ఆపండని రూజ్‌వెల్ట్‌కి, చర్చిల్‌కి, హిట్లర్‌కి, ఇతర యుద్ధ

ప్రభువులకి టెలిగ్రామ్‌లు పంపాడు. పండితనెహ్రూ వచ్చి "మన భూభాగం కాపాడుకోవడానికి నేను సైన్యాన్ని పంపనా" అనడిగితే పంపమని చెప్పాడు. సైన్యం చేతికి చరఖాలు ఇచ్చి పంపకపోయాడా? అంటే ఏంటీ ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి. అవి మనకు వర్తించవనేగా.

**ప్ర : 'హిందువులు చాలా కాలంగా పిరికితనంగా బతుకుతున్నారు. నిజానికి అహింసామార్గం హిందువులని బలహీనులుగా మారుస్తుంది. ఇప్పటినుండయినా మనం దూకుడు మీద ఉండాలి' అని ఉమాభారతి, సాధ్వి రితంబర పిలుపునిస్తున్నారు.**

**జ :** ఆ మాటలు నేను ఒప్పుకోను. నాదేశంలో నేను దూకుడుగా రెచ్చిపోవాల్సిన పనిలేదు. ఉదాహరణకి నాకు మలేరియా జ్వరం సోకిందనుకోండి డాక్టరు నాకు ఇంజెక్షన్ చేస్తాడు. నా శరీరం మీద దాడి చేసిన మలేరియాను నా ఒంట్లోంచి తుడిచేస్తాడు. ఇక్కడ మలేరియా పట్ల నేను దూకుడుగా ఎందుకుండాలి. అదే నా శరీరాన్ని దురాక్రమించింది కదా. ఇందుకు పరిష్కారం దెబ్బకి దెబ్బ తియ్యడమే. తుడిచిపెట్టెయ్యాలంటే భరతమాత దేహం మీద ఇలాంటి మలేరియా క్రిముల వంటివాటిని ఏరిపారెయ్యాలి దానికి మీరేం పేరు పెట్టుకున్నా సరే.

**ప్ర : హిందూ మహాసభకు బిజెపికి మధ్యన ఒక కొనసాగింపు ఉందని మీరు ఎలా అనుకుంటున్నారు?**

**జ :** ఇవన్నీ హిందూరాజ్య స్థాపనకు కలిసి రావాల్సిందే అంతకుమించి వేరే దారిలేదు. హిందువులు –ముస్లిమ్‌ల మధ్యన విభజన వచ్చి తీరుతుంది. అప్పుడు మరో బోస్నియాను ఇక్కడి చూస్తారు.

**ప్ర : అంటే అంతర్యుద్ధం వస్తుందనా?**

**జ :** అనివార్యంగా, ఓట్లకోసం ముస్లిమ్‌లను బుజ్జగించే ధోరణి జనాన్ని ఆ వైపుకు నెడుతుంది. బిజెపి నేరుగా హిందూ కార్డును వాడదు. వాడలేదు కూడా. వాళ్ళు ముస్లిం ఓట్లను లెక్కలోకి తీసుకోకూడదు. ఒకసారేమో 'రామమందిరం అంటారు ఆనక ముస్లింలకు సర్ది చెప్పే మాటలు చెబుతుంటారు అవన్నీ చెల్లవ్.

**ప్ర : జాతీయోద్యమం కాలంలోను, అనేక సామాజిక సంస్కరణ ఉద్యమాల్లోను ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అట్లాంటి జనం సాంస్కృతిక నేపథ్యం ఏమై**

**ఉంటుందని మీరనుకుంటున్నారు. అందులో చాలామంది సద్బ్రాహ్మణ కుటుంబాల నుండి వచ్చిన వారు కూడా ఉన్నారుగా?**

**జ :** బ్రాహ్మణ తరగతికి చెందినవాళ్ళు – పీష్వాలు– అందరికన్నా పైన ఉంటారు. వాళ్ళలో విప్లవకారులు ఉన్నారు. మంగళ్‌పాండేని తీసుకోండి. స్వాతంత్ర్యోద్యమ హీరో అతను. బ్రాహ్మడు. అట్లే మహారాష్ట్ర వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే అని బ్రాహ్మడు, తిరుగుబాటు లేవదీశాడు. ఏడెన్‌కు తరలించాక 1883లో చనిపోయాడు. ఇహ ఛాపేకర్ సోదరుల సంగతి తీసుకోండి. 1897 పూనా ప్లేగ్ కమిటీకి నిరంకుశ అధ్యక్షుడిగా వ్యవహరించిన వాల్టర్ ఛార్లెస్ పాండేని హతమర్చారు. లోకమాన్య తిలక్ ఎవరు? బ్రాహ్మడు. విష్ణుశాస్త్రి చిపులంకర్, రానడే.. ఇలా..

ప్ర : **మీరు చెప్పదలచుకుంది ఏమిటి?**

**జ :** వాళ్లంతా గొప్ప ఆలోచనాపరులు. దేశం కోసం బలిదానానికి సిద్ధ పడిన వాళ్ళు. దేశ సమగ్రతకోసం నిలబడిన వాళ్లు విభజన మూలంగా మహారాష్ట్రకు ప్రత్యేకంగా నష్టం వాటిల్లింది ఏమీ లేదు. అయినప్పటికీ మహారాష్ట్రనుండి వేరుపడిన ప్రొవిన్షియల్ ప్రాంతాలు, అక్కడ ఆకృత్యాలకు గురవుతున్న ప్రజానీకం గురించి ఒక మహారాష్ట్రీయుడు 2000 మైళ్ల దూరానికి పోవాల్సిన అవసరం ఏమొచ్చింది. జాతీయ సమగ్రత అంటే అదీ. ఆ సంప్రదాయంలాంటి గొప్ప ఉత్తేజంతో నడిచింది. ఆ విశాల భావన నడిపించింది ఈ పేపర్లు ఉన్నయ్యే 'ఎల్లో జర్నలిజమ్' అని చెప్పుకోవచ్చు. అవి పీష్వా పేరుని బ్రాహ్మణులని అప్రతిష్ట పాల్జెయ్యడానికి వాడుకుంటూ ఉంటారు. ఎందుకంటే అవి సోకాల్డ్ బలహీన తరగతులనుండి, బహుజనుల నుండి వారిని బుజ్జగించడమే పనిగా పెట్టుకున్నాయి.

ప్ర : **ఈ రెండు ప్రత్యేకతలకు విలువలేదంటారా?**

**జ :** నేను ఇంతకు ముందు చెప్పినట్లు విభజన సమయంలో ఎవరినీ ఉపేక్షించలా. అందరూ ఊచకోతకు గురయ్యారు. ముస్లిమ్ కత్తులకు ఎరగా మారిన వారంతా హిందువులే. శ్మశానంలో మనం కలుసుకున్నాం. కానీ బతికి ఉన్నంతకాలం "లేదు లేదు నేను హిందువుని కాదు' అని చెప్పుకుంటాం. హిందువులెవరో ముస్లిమ్‌లు నిర్ణయిస్తారు. అదలా జరుగుతుంది అంతే. ఎవరికన్నా పారంపర్యంగా సంపద

లభించింది అనుకోండి దర్జాగా ఖర్చులు పెడుతూ ఉంటారు. వాళ్ళకు దాని విలువ తెలియదు. ఈ జనానికి, హిందూత్వ కూడా అలాంటిదే. నవ్వొస్తుంది తల్చుకుంటే.

ప్ర : ఏ జనం ?

**జ :** హిందూత్వని విమర్శించేవారంతే. వాళ్లకి దాని విలువ తెలియదు.

*(ఫ్రంట్‌లైన్, **1994** జనవరి **28** సంచిక.)*

❖

## ఆర్ ఎస్ ఎస్ పై నిషేధం

### ప్రభుత్వం తరపున హోంమంత్రి సర్దార్‌పటేల్ విడుదల చేసిన ప్రకటన

మనదేశంలో విద్వేషాన్ని, హింసని రగిలించే శక్తులను, మనజాతి స్వేచ్ఛని సంక్షోభంలోకి నెట్టి భారతమాత ప్రతిష్టని దిగజార్చే శక్తులను ఏరిపారెయ్యాలని భారత ప్రభుత్వం 1948 ఫిబ్రవరి4 తీర్మానం ద్వారా తన కృతనిశ్చయాన్ని ప్రకటించింది. భారత ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగా చీఫ్ కమిషనర్ ప్రోవిన్షియల్ ప్రాంతాల్లో ఆర్.యస్.యస్‌ని చట్ట విరుద్ధమైన సంస్థగా ప్రకటించాలని నిర్ణయించింది. గవర్నర్ ప్రోవిన్షియల్ ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన నిషేధం విధించేందుకు తగిన చర్యలు చేపడతారు.

కేంద్ర ప్రభుత్వంగాని, ప్రోవిన్షియల్ ప్రభుత్వాలుగానీ ప్రజాస్వామిక దృక్పథం, విధానాలు, లక్ష్యాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ ఏ పార్టీ అయినా, సంస్థ అయినా నిజాయితీతో చిత్తశుద్ధితో చేపట్టే రాజకీయ, సామాజిక, ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం కల్పించాలనే తపన ప్రదర్శిస్తూ వచ్చాయి. అయితే ఆ కార్యకలాపాలు ఏవయినా ఉమ్మడిగా గుర్తించిన చట్ట పరిధులను అతిక్రమించరాదనే షరతుకు లోబడి పార్టీలు, సంస్థలు పనిచెయ్యాలి.

హిందువులను శారీరకంగా, భౌతికంగా , నైతికంగా అభివృద్ధి చెయ్యడం, సోదరభావాన్ని సేవాభావాన్ని పెంపొందించడం తమ లక్ష్యాలని ఆర్.యస్.యస్ ప్రకటించింది. ప్రభుత్వమే స్వయంగా ఈ దేశంలోని అన్ని తరగతుల ప్రజానీకం

పాదార్థిక– భౌతిక ప్రమాణాలను అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉంది. అందుకు అనుగుణంగానే అనేక పథకాలు రూపొందించింది. అందులో భాగంగానే దేశంలోని యువజనులకు శారీరక వ్యాయామం, మిలిటరీ శిక్షణా తరగతుల బోధనకు సంకల్పించింది. ఆర్.యస్.యస్ విషయానికి వస్తే అది ఏ లక్ష్యాలతో పనిచేస్తామని ప్రకటించిందో ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ వస్తున్నదని ప్రభుత్వం గమనించింది. సంఘ్ సభ్యులు అవాంఛనీయమైన, ప్రమాదకరమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దేశంలోని అనేక ప్రాంతాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యులు లూటీలు, హత్యలు, దోపిడీలు, హింసలకు పాల్పడుతున్నారు. అక్రమంగా ఆయుధాలు, మందుగుండు సమీకరిస్తున్నారు. ప్రజలను ఉగ్రవాద చర్యలకు ప్రేరేపించేలా, తుపాకులు సేకరించేలా ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను, పోలీసు, మిలిటరీ వ్యవస్థల పట్ల అవిశ్వాసం పెంపొందించేలా రకరకాల కథనాలతో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఉన్నారు. ఈ కార్యకలాపాలన్నీ ఆర్.యస్.యస్ చాలా రహస్యంగా చేపట్టింది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇవన్నీ గమనిస్తుంది. ఆర్.యస్.యస్ ఇప్పుడే కార్యకలాపాలు కార్పోరేట్ స్థాయిలో మొదలుపెట్టింది. ప్రోవిన్షియల్ రాష్ట్రాల హోమ్ మంత్రులతో కేంద్రహోంమంత్రి సమావేశమైన ఒక సదస్సులో ఇవన్నీ చర్చకు వచ్చాయి.(ప్రైవేటు ఆయుధాలపై ఏఐసిసి తీర్మానం 1947, నవంబర్ 15న)

సంస్థగా ఆర్.యస్.యస్ మీద మొత్తంగా చర్యలు తీసుకోవడానికి ఇంకా సమయం ఆసన్నం కాలేదని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకి పాల్పడిన వ్యక్తుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సమావేశం నిర్ణయించింది. సంఘ్‌పరివార్ అభ్యంతరకర, ప్రమాదకర కార్యకలాపాలు మాత్రం అడ్డు అదుపూ లేనట్లు సాగిపోతున్నాయి. హింసా సంస్కృతిని వ్యాపింపచేస్తుంది. అమాయక ప్రజానీకాన్ని బలితీసుకుంటున్నది. గాంధీజీ హత్య సంఘ్‌పరివార్ అకృత్యాలకు పరాకాష్ట.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఇలాంటి హింసాత్మక చర్యలను పూర్తిగా కట్టడి చెయ్యడానికి, విద్వేష కార్యకలాపాలకు ముకుతాడు వెయ్యడానికి కఠినాతి కఠినమైన చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. ఆర్.యస్.యస్‌ను చట్ట వ్యతిరేకమైన సంస్థగా

ప్రకటిస్తుంది. దేశక్షేమాన్ని ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి చట్టంపట్ల గౌరవం ఉన్న పౌరులందరూ మద్దతుగా నిలుస్తారనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

❖

